ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 17.06.2026 | సంపుటి :12 సంచిక : 328 | పేజీలు :12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





## టెలిగ్రామ్‌పై ఆంక్షలు

**నీట్ రీటెస్ట్ నేపథ్యంలో యాప్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. రీ ఎగ్జామ్ విషయంలో కేంద్రం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈనేప థ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. మిగతా 9లో..

## ఇకపై దగ్గు మందు కొనుగోలుకు డాక్టర్ చీటీ తప్పనిసరి



9 లో..

# రైతువేదికల్లో విత్తనాలు పంపిణీ చేయాలి



**విత్తనాల నుంచి కొనుగోళ్ల దాకా సమగ్ర కార్యాచరణకు ప్రత్యేక కమిటీ**

- సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై అందజేయాలి
- అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యత అప్పగించాలి
- ఎంపీలతో కలిసి కేంద్రం వద్దకు మంత్రుల టీం
- రామగుండంలో తయారయ్యే మొత్తం ఎరువులు రాష్ట్రానికే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసి ఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి , వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటివరకు ఉన్న అనుభవాలు, రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలను సమీక్ష సమావేశంలో చర్చించారు. మిగతా 2లో..

## రైల్వే మంత్రితో భేటీ ఏర్పాటు చేయించండి

- ఎప్పుడైనా ఎక్కడైనా సిద్ధమే...మీ కాల్ కోసం ఎదురుచూస్తా
- అవసరమైన అన్ని పత్రాలతో వచ్చి స్పష్టత ఇస్తా
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ సీఎం రేవంత్ బహిరంగ లేఖ
- బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై సీఎం సమీక్ష
- హైదరాబాద్-పుణె రైల్వే మార్గంలో అనంతగిరి వద్ద స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- హైదరాబాద్-బెంగళూరు రైల్వేమార్గంలో ఫ్యూచర్ సిటీలో స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం

9 లో..

## ఏసీబీ అదుపులో అవినీతి జలగ

- ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి అక్రమాస్తులు రూ.150 కోట్లకు పైనే!
- ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు



**హైదరాబాద్(జనంసాక్షి):** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. నరహరి ఇంట్లో రూ. 1.54కోట్ల నగదు, రూ. 5.04 కోట్ల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలో రూ. 2.29 కోట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు, భార్య పేరున రెండు బ్యాంకు లాకర్లు, కారు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఓ అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 భవనం, ఛత్రినాకలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ మిగతా 2లో..

## పారదర్శకంగా యూరియా పంపిణీ

- ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్
- క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం : తుమ్మల

**కామారెడ్డి(జనంసాక్షి):** రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళ వారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ మిగతా 2లో..



## కాంట్రాక్టర్లు 'చలో హైదరాబాద్' విరమించుకోవాలి

**పెండింగ్ బిల్లులను మూడు నెలల్లో చెల్లిస్తాం: మంత్రి కోమటిరెడ్డి**

12 లో..

## నాపై ఆరోపణలు నిరూపించండి



**ముఖ్యమంత్రి రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్**

**దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని వెల్లడి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకా రమందిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా మిగతా 9లో..

## బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకే ఎస్ఐఆర్

**బెంగాల్లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం • కేంద్రానికి తొత్తుగా ఈసీ**

**బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**




**సంగారెడ్డి(జనంసాక్షి):** కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ పక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని ,అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ పక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ మిగతా 2లో..

# ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదురుతుంది



**ట్రంప్ ఆశాభావం • హార్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా**

| త్వరలో నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి | శుక్రవారానికి పూర్తిగా తెరుచుకుంటుంది | ఇరాన్‌తో ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా | జీ7 సదస్సులో ట్రంప్ కీలక ప్రకటన |
|---|---|---|---|

**ప్యారిస్(జనంసాక్షి):** ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హార్మూజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని తెలిపారు. ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల తొలి దశ విజయవంతంగా పూర్తైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే పక్రియ అమలులోకి మిగతా 2లో..



**టోల్ ఉండదు కానీ..**

## కొంత సర్వీస్ ఛార్జీగా వసూలు చేస్తాం


**జలసంధి విషయంలో ఇరాన్ మెలిక**

**టెహ్రాన్(జనంసాక్షి):** హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ మెలిక పెట్టింది. టోల్ ఉండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా.. కొంత మిగతా 2లో..

## వలసలను అరికట్టి.. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మార్చుకుందాం

- పేద దేశాల ప్రజలు వస్తే.. మనమూ పేదలమవుతాం
- నేను లేకుంటే ఇజ్రాయెల్ ఉండేది కాదు : ట్రంప్
- ట్రంప్‌తో కొన్నిసార్లు విభేదాలు వస్తుంటాయి.. నెతన్యాహు

2 లో..



## జీ7 సదస్సులో మోదీ, ట్రంప్ సందడి

**అమెరికా అధ్యక్షుడికి భారత ప్రధాని కరచాలనం**

## మీ సర్కారులో అన్నీ స్కాంలే..

**ప్రభుత్వంపై హరీశ్‌రావు ఆరోపణలు**



**హైదరాబాద్(జనంసాక్షి):** గురుకుల పాఠశాలల్లో పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పులో రూ.2000 కోట్ల స్కామ్ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని.. పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పులో ఎవరైనా స్కామ్ చేస్తారా..? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు (డిజిటల్) కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ నాకు ఛాలెంజ్ విసురుతున్నారు.. మేము కొన్నదే రూ.650 కోట్లకు కొంటే రూ.2000 కోట్ల స్కామ్ ఎక్కడి నుండి వచ్చిందని అంటున్నారు. మీ డిపార్టుమెంట్లో మంత్రులుగా మిగతా 9లో..

## అసత్యప్రచారాలు మానండి

**ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా..**

**హరీష్‌రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్**



**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన కామెంట్స్ కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహారం, కోడిగుడ్ల సరఫరాలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు చేసిన ఆరోపణలు చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లకు అసలు తమ డిపార్ట్‌మెంట్‌లలో ఏం జరుగుతుందో కూడా తెలియని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. యూనిఫాంలు, టైల కోసం మిగతా 9లో..


## రాష్ట్రవ్యాప్తంగా 'ఈగిల్' దాడులు

**గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా**

**19మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**14మందికి గంజాయి పాజిటివ్‌గా గుర్తింపు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం ఈగల్ ఫోర్స్ పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా 19 మందిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 14 మందికి మిగతా 2లో..



## కూప్ప కూలిన బీ-52 బాంబర్ విమానం

**8 మంది మృతి**

**వాషింగ్టన్(జనంసాక్షి):** దక్షిణ కాలిఫోర్నియాలో ఓ విమానం కూలింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. ప్రమాదానికి గురైన విమానాన్ని అమెరికా వైమానిక దళానికి చెందిన బీ-52 బాంబర్ విమానంగా గుర్తించారు. ఈ ఘటనలో ఎనిమిది మంది అమెరికా వాయుసేన సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఎడ్వర్డ్స్ వైమానిక స్థావరం నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అధికారులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. అమెరికా వాయుసేన అమ్ములపొదిలో చాలా పాత బాంబర్ విమానాల్లో బి-52 స్ట్రాటోఫోర్ట్రెస్ ముఖ్యమైంది. ఇది 1955లో ఆ దేశ వాయుసేన చేతికి వచ్చింది. మొత్తం 744 విమానాలను తయారుచేయగా.. చివరి బి-52హెచ్ వేరియంట్‌ను 1962లో తయారుచేశారంటే అవెంత పాతవో అర్థం చేసుకోవచ్చు. ఇది ఒక్కటే 20 క్రూజ్ క్షిపణులను ప్రయోగించగలదు. దీనిని అవసరాలకు అనుగుణంగా అమెరికా యుద్ధాల్లో వాడుకొంటోంది. కోల్డ్‌వార్ వేళ అణ్వాయుధాలను ప్రయోగించగల మిగతా 2లో..

## ఆర్ అండ్ బీలో కాంట్రాక్టర్లకు బకాయిలు

- యాదగిరిగుట్టకు సంబంధించి 350 కోట్లు పెండింగ్
- కాంట్రాక్టర్లతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, జూన్16 (జనంసాక్షి) :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లతో పనులు చేయించి బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట నిర్మించామని గొప్పలు చెబుతున్నారని, గుట్ట బిల్లులు కూడా రూ.350 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. మంగళవారం తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌ను చర్చలకు ఆహ్వానించామని.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్ అండ్ బీలో రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టిందని.. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని విమర్శించారు. బిల్లుల కోసం ఈనెల 18న చలో హైదరాబాద్ కు తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చిందని మంత్రి తెలిపారు. సీఎంతో మాట్లాడి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చామన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరగా.. ఈరోజు సాయంత్రం వరకు చర్చించుకుని నిర్ణయం చెబుతామని వారు చెప్పారన్నారు. పత్రికల్లో వార్తల కోసం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు తమపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బట్టకాల్చి మీద వేస్తే కాలిపోతామని అనుకుంటున్నారని అన్నారు. 'మేం ఎంతకు కాంట్రాక్టులు ఇచ్చామో? చూస్తే హరీశ్ రావు తాను పొరపాటుగా మాట్లాడినట్లు ఒప్పుకుంటారు' అంటూ మంత్రి కోమిటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## అడవిలో అన్నలు లేరని కార్మికులను పట్టించుకుంటలే!

- అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలి
- భూగర్భ గనులు ప్రారంభించి ఉద్యోగ అవకాశాలు పెంచాలి
- కాంగ్రెస్ పార్టీ అవినీతి మూలంగానే సింగరేణికి నష్టం
- టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 16 (జనంసాక్షి) :** అన్నలు అడవిలో ఉన్నప్పుడు అధికారులు కార్మికులతో సన్నిహితంగా ఉంటూ కార్మికులకు సౌకర్యాలు కల్పించే వారిని ,ఇప్పుడు అన్నలు లేరని కార్మికుల గురించి అడిగే వారు లేరని అనుకోవద్దని టిఆర్ఎస్ పార్టీలోనే అన్నలు ఉన్నారని టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సింగరేణి అధికారులను హెచ్చరించారు. మంచిర్యాల జిల్లాలో టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పర్యటనలో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్కే 7 మైన్స్ సమావేశంలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి బాయి బాట కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లాలో సోమ, మంగళవారాలలో పలు సింగరేణి గనుల ను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ విధానాలను ప్రశ్నించారు. జిల్లాలో టిఆర్ఎస్ అధినేత్రి కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కాసిపేట భూగర్భ గని సందర్శించి కార్మికులతో మమేకమై కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల పక్షాన తను గొంతు విప్పడానికి సిద్ధంగా ఉన్నానని కార్మికులు ధైర్యంతో ఉండాలని తెలిపారు. అక్కడనుండి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు గుండా గిరి చేస్తున్నాడని వెంటనే గుండాగిరి బంద్ చేయాలని ఆమె హెచ్చరించారు. ప్రజలు ఐదేళ్ల కాలానికి అధికారాన్ని అప్పగించారని అదేం శాశ్వత అధికారం కాదని అధికారాన్ని అడ్డం పెట్టుకుని గుండా గిరి చేయడం మానుకోవాలని ఆమె హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలు పొందాలని కానీ గుండా గురిచేసి తమకు వ్యతిరేకంగా ఇతర పార్టీలలో ఉన్న నాయకులను టార్గెట్ చేసి వారిపై గుండా గిరి చేయడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి కారణంగానే సింగరేణి సంస్థ నష్టపోతుందని పేర్కొన్నారు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప కార్మికులకు ఒరగబెట్టింది ఏమీ లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నట్టుగా కార్మికులకు వినతి పత్రాలు ఇవ్వడం కార్మికులను మభ్యపెట్టడం ఇలాంటి వేషాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సింగరేణి జిఎం క్లర్క్ చేసే పనులను చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉండి కార్మికులకు న్యాయం చేయవలసిన బట్టి విక్రమార్క కార్మికుల దగ్గరికి వెళ్లి మాయమాటలతో మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తుందని అప్పుడు సింగరేణి సంస్థ అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గుజరాత్ మాదిరిగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. రామగుండం రీజియన్ లో 25 వేల జీతం ఇస్తుండగా శ్రీరాంపూర్ డివిజన్లో 20 ఇస్తున్నారని ఈ వ్యత్యాసం ఏమిటని ప్రశ్నించారు . ఇక్కడికి కార్మికులకు రామగుండం మాదిరిగానే 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కవిత

**కౌటాల జూన్ 16(జనం సాక్షి) :** తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం కౌటాల మండల కేంద్రంలోని తుమ్మిడి హేటి బ్యారేజ్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ తుమ్మిడి హేటి ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటి వరకు 5గురు ముఖ్య మంత్రులు వచ్చి హామీలు ఇచ్చారు కని ప్రారంభానికి నోచుకోవడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని చెప్పారు. ఇప్పుడు ముఖ్యమంత్రి అపయ్మెంట్ ఇవ్వడం లేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే హరీష్ బాబు అసెంబ్లీ లో కాంగ్రెస్ ఎమ్మెల్యే లా మాట్లాడుతూన్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ వచ్చే ఎన్నికల్లో 5గ్యారెంటీ లతో పోటీ చేయబోతోందని అన్నారు. పార్టీ బలోపేతానికి అందరీ సహకారం కావాలని మీతో కలిసి మీ సమస్యల కోసం పోరాటం చేస్తామని, రైతు ఎక్కడికి వెళ్లినా గౌరవం ఇవ్వాలని రైతే రాజు అంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు కట్టి ఉంటే రైతుల పంటలకు నీళ్లు పుష్కలంగా అందేది. ప్రాజెక్టు నిర్మాణం ఎత్తు గతంలో 148మీటర్లు వరకు నిర్మించి రెండు రాష్ట్రాల ప్రజలు ముంపునకు గురి కాకుండా చూసుకొని తొందర్లోనే నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. 2006 లోనే నిర్మాణ పనులు మొదలు పెడతామని చెప్పి 2026వచ్చిన ప్రారంభం కాలేదనీ అన్నారు.

## విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతానికి చర్యలు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



**నిర్మల్ బ్యూరో, జూన్16 (జనంసాక్షి) :** ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మంగళవారం నిర్మల్ సర్కిల్‌లో పర్యటించి, వర్షాలు, ఈదురుగాలుల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్ల పరిస్థితిని కడెం, ఖానాపూర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించి వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కడెం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించిన సీఎండీ, ఉపకేంద్ర పనితీరు, నిర్వహణ చర్యలు, వినియోగదారులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రాంతాల గుండా వెళ్లే కడెం, పెంబి ప్రాంతాల 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లపై కవర్డ్ కండక్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో చెట్ల కొమ్మలు లైన్లపై పడటం వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలను నివారించవచ్చని తెలిపారు. కడెం, పెంబి, దస్తురాబాద్ ప్రాంతాల సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే తాళ్లపేటలో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు మంజూరు లభించిందని, నిర్మల్-ఖానాపూర్ 132 కేవీ లైన్‌ను డబుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎండీ, నిర్వహణ పనుల సమయంలో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వ్యక్తిగత రక్షణ పరికరాలు (గ్లౌజు) వినియోగిస్తూ "భద్రతే మొదటి కర్తవ్యం" అనే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఫీల్డ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో నిర్మల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాథోడ్ సుభాష్, డీఈ నాగరాజు, డీఈ భాస్కర్, ఏడీఈ శ్రీనివాస్ తదితర అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటి, నల్లా పన్ను మినహాయింపు..

- చౌటపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం అద్భుత నిర్ణయం
- పదో తరగతి టాపర్లకు రూ.5,116 నగదు బహుమతి

**పర్వతగిరి, జూన్ 16 (జూన్ సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను అడ్మిషన్లను పెంచడం మరియు విద్యను ప్రోత్సహించడమే ధ్యేయంగా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మంగళవారం చౌటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మట్టపెల్లి వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన, ఉప సర్పంచ్ పెసరి దర్గేష్ మరియు వార్డు సభ్యుల సమక్షంలో అత్యవసర గ్రామపంచాయతీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రెండు ముఖ్యమైన ఏకగ్రీవ తీర్మానాలను ఆమోదించినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ తీసుకుని, చదువుకునే విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు ఇంటి పన్ను మరియు నల్లా (వాటర్) పన్నును పూర్తిగా మినహాయిస్తున్నట్లు తీర్మానించారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గానూ వారికి రూ.5,116/- నగదు బహుమతిని అందించాలని తీర్మాణం చెసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్టపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ గ్రామంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, గ్రామస్తులం దరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని, తమ పిల్లలను చౌటపల్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి పన్ను మినహాయింపులు మరియు బహుమతులు పొందాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి అశోక్ నాయక్ ఉప సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులైన చిడిమిల్ల అశోక్,చామంతుల లక్ష్మి, మట్టపెల్లి నిఖిల్ రావు, గౌరారపు నరసింహస్వామి, గౌరారాపు అయిలయ్య,నాతి నర్సమ్మ, రాజబోయిన అరుణ,చెన్నూరి సుభద్ర, దామెర రమ పంచాయతీ సిబ్బందిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



### తాడిచర్ల బొగ్గు గనిలో కేంద్ర బృందం తనిఖీ

**మల్హర్,జూన్ 16 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన తాడిచర్ల-1 ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని కేంద్ర పర్యావరణ, శీతోష్ణస్థితి మార్పుల మంత్రిత్వ శాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఎం.టి. కరుప్పాయ్ రెండు రోజుల పాటు క్షుణ్ణంగా పరిశీలించారు. గనిలో పర్యావరణ అనుమతి నిబంధనల అమలు, గాలి, నీటి నాణ్యత, దుమ్ము నియంత్రణ, హరితహారం మరియు వ్యర్థాల నిర్వహణ చర్యలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గని యాజమాన్యం పునరావాస కార్యక్రమాలు, భూసార పరిరక్షణ, సామాజిక బాధ్యత పనుల వివరాలను అధికారికి సమర్పించింది. వివిధ ప్రాంతాలను సందర్శించిన అనంతరం ఆయన తన నివేదికను కేంద్ర మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ జెన్‌కో జనరల్ మేనేజర్ పి. మోహన్ రావు, ఈఈ సివిల్ తౌఫీల్ అహ్మద్ మరియు గని యాజమాన్యం నుండి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి. శ్రీధర్, ప్రాజెక్ట్ హెడ్ ఎ. ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కే ఎస్ ఎన్ మూర్తి, మైన్ మేనేజర్ జి శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ కే సురేష్ బాబు, ఎస్టేట్ ఆఫీసర్ రామచంద్ర మూర్తి, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ రామ్ కుమార్, అభిషేక్, సర్వే డి.జి.యం ఎమ్ సర్వోత్తమ్, శేషావతారం, ప్రాజెక్ట్ ఇంజనీర్ కే. కిషన్, హెచ్ ఆర్ డి.జి.యం రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

**వరంగల్, జూన్16 (జనంసాక్షి) :** సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడటం వరంగల్ జిల్లాలో కలకలం సృష్టించింది. ఢిల్లీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న వరంగల్ కాశీబుగ్గకు చెందిన యువతి మానసిక ఒత్తిడితో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాశీబుగ్గలో పాత పేపర్లు కొనే వ్యాపారం చేసే గంజి ఉమాశంకర్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో రెండు కుమార్తె గంజి కీర్తన (25) ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ఇటీవల పనిభారంతో కీర్తన తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. మానసికంగా డిప్రెషన్‌లోకి వెళ్లిన కూతుర్ని చూసిన తల్లిదండ్రులు మూడు నెలల క్రితం వరంగల్‌కు తీసుకొచ్చారు. హనుమకొండలోని ఓ మానసిక వైద్యుడి వద్ద కొంతకాలంగా చికిత్స కూడా ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి కీర్తన ఫ్యాన్‌కు ఉరేసుకుంది.

### నేడు హనుమకొండ పవన్ పర్యటన

**వరంగల్ ఈస్ట్, జూన్ 16 (జనం సాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేడు హనుమకొండలో పర్యటించనున్నారు. ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి హనుమకొండకు చేరుకుంటారు. ఉదయం 9:45 గంటలకు హనుమకొండలోని నిరంజన్ అనే బాలుడిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 10:45 గంటలకు శ్రీ భద్రకాళి దేవాలయంలో భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటారు. 11:15 గంటలకు భద్రకాళి ఆలయం నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

## ప్లాస్టిక్ వద్దు.. మోదుగ విస్తరాకులు ముద్దు

- కుబీర్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



**కుబీర్, జూన్ 16 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా కుబీర్ మండల కేంద్రంలో ప్లాస్టిక్ నిషేధంపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. మంగళవారం కుబీర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవ్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, మానవ మనుగడకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్లాస్టిక్ వద్దు.. మోదుగ విస్తరాకులు ముద్దు' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్తను పారవేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని, వేర్వేరుగా వేరు చేసి పంచాయతీ వాహనాలకు అందించాలని సూచించారు. ఇకపై గ్రామంలో సింగిల్ యూజ్ (ఏకకాల) ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్లాస్టిక్ విక్రయించినా, వాడినా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారికి రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు జరిమానా విధిస్తామని కార్యదర్శి మాధవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూది గంగాధర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో నాబార్డ్ కార్యాలయం ప్రారంభం



**మహబూబాబ్, జూన్ 16(జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లాలో నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యాలయాన్ని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయ భాస్కర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వాతి బల్లముడి, డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ సాయిరామ్ చౌరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్, ప్రస్తుత సంవత్సరంలో మహబూబాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా నాబార్డ్ కార్యాలయం ఏర్పాటు చేయడం ఒక కీలక నిర్ణయమని తెలిపారు. ఈ కార్యాలయం ద్వారా జిల్లా నలుమూలలకు మరింత వేగంగా, సమర్థవంతంగా నాబార్డ్ సేవలు అందించగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ యాదగిరి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా సహకార అధికారి విజయ కుమారి, డిహెచ్‌ఎస్ఓ మరియన్నా, డీఐసీ జనరల్ మేనేజర్ మన్నారాయణ రెడ్డి, డీవీఏహెచ్ఓ బి. కిరణ్ స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు) ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బాలిక ఆత్మహత్య.. నిందితుడి అరెస్ట్



**కుబీర్, జూన్ 16 (జనంసాక్షి) :** మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. భైంసా రూరల్ సి.ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సి.ఐ ఎం. ప్రవీణ్ కుమార్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. నిర్మల్ జిల్లా కుబీర్ మండలం సౌనా గ్రామానికి చెందిన చిట్టెల్కర్ సాయినాథ్ (33), ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే మండలానికి చెందిన ఒక మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్న సాయినాథ్, ఆమెను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పెళ్లికి నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధిత బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుబీర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 93/2026 కింద కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్ పర్యవేక్షణలో నిందితుడి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం బాకోట్ గ్రామ శివారులో సాయినాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను తన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి ఒక ఒప్పో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సి.ఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించింది. తదుపరి విచారణ కొనసాగుతుందని తెలిపారు. మహిళలు, మైనర్లపై అకృత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## గిరిజనుల మధ్య భూ వివాదాలు

- భారీ బందోబస్తుల మధ్య హద్దుల ఏర్పాటు...



**కడెం, జూన్ 16 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కడెం మండలం మైసంపేట్, రాంపూర్ పునరావాస గ్రామస్తులకు వ్యవసాయ భూములు హద్దులు చూపిస్తుండగా అడ్డుకొని తమ గ్రామ గిరిజనులకు భూములు కేటాయించిన తర్వాతే హద్దులు చూపించాలని డిమాండ్ చేసిన నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 20 మంది ఆందోళన కారులను అదుపులోకి తీసుకొని జన్నారం మండలం ఇంధన్ పల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి అటవీశాఖ అధికారులు వారి వాహనలలో తరలించారు. ఎఫ్‌డీవో శివకుమార్, సిఐలు సత్యనారాయణ, సమ్మయ్య దాదాపు 150 మంది పోలీస్, అటవీశాఖ అధికారులు,సిబ్బంది భారీ బందోబస్తు మధ్య మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూములను చదును చేస్తూ రెవెన్యూ అధికారులు హద్దు రాళ్లను పాతుతూ వారి పట్టా నెంబర్లను వేస్తున్నారు. అయితే ఈ భూములలో కొంత నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు గతంలో పోరుకులు కొట్టుకొని తాము సాగు చేశామని అట్టి భూములను తమకు కేటాయించిన తర్వాతే మైసంపేట్ గ్రామస్తులకు భూములు పంపిణీ చేయాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. భారీ బందోబస్తు మధ్య నేడు భూములకు హద్దులు ఏర్పాటుచేసి పంపిణీ చేసిన తర్వాత మళ్లీ నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు గతంలో ఉన్న భూములను తాము సాగు చేసుకుంటామని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మైసంపేట్ గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ప్రతినిధి జూన్ 16 (జనం సాక్షి) :** హనుమకొండ నగరం లోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. పాఠశాలలో విద్యా బోధన, హాజరు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వేసవి సెలవులను ఎలా గడిపారు, ఏవైనా క్రీడలను అభ్యసించారా అని ప్రశ్నించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమైన తర్వాత ఎలా అనిపిస్తోందని విద్యార్థులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్, పాఠశాలలో నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
17 జూన్ 2026

సంపాదకీయం

# పవనాలుది మీదిమీది పోరాటమే..

పవన్ కళ్యాణ్ మాట్లాడతారు. బాగా మాట్లాడతారు. గొంతులో జోరుంటుంది, కళ్ళలో మంటుంటుంది, వేదికపై నిలబడితే జనం చప్పట్లు కొడతారు. తెలంగాణ నాయకులు కేంద్రానికి వెళ్తే నోరు మూసుకుంటారని చెప్పిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు ఉపముఖ్యమంత్రి పదవిలో ఢిల్లీ మెట్లు ఎక్కుతున్నారు. ఆ మెట్లు ఎక్కిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా గురించి మోడీతో ఎన్నిసార్లు మాట్లాడారు? సమాధానం మౌనం. ఆ మౌనమే అసలు సమాధానం.

2014 నెల్లూరు సభ మనకు గుర్తుంది. నరేంద్ర మోడీ ప్రధాని అభ్యర్థి హోదాలో వేదికపై నిలబడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వస్తుందని ప్రకటించారు. అంతేకాదు, ఆ ప్రతిష్ట ఒకరికే దక్కాలంటే అది నెల్లూరు ముద్దుబిడ్డ వెంకయ్యనాయుడికే దక్కుతుందని కూడా చెప్పారు. ఆ మాటలు గాలిలో కలిసిపోయాయి. ఆ హామీ కాగితాల మూటలో మూలుగుతోంది. పార్లమెంటులో విభజన సరిగా జరగలేదని గొంతు చించుకున్న సీమాంధ్ర నాయకులు హోదా విషయంలో మాత్రం అటు ఇటు చూస్తున్నారు. తెలుగుదేశం పార్టీ రెండు కేంద్ర ప్రభుత్వాల్లో భాగస్వామి అయింది. ఇప్పుడు మోడీ సర్కారు ఒక కాలు చంద్రబాబు మద్దతుతోనే నడుస్తోంది. అయినా ప్రత్యేక హోదా మాటెత్తే ధైర్యం లేకపోయింది.

ఇక్కడ అలిశెట్టి ప్రభాకర్ మాటలు గుర్తొస్తాయి. అంగం కుళ్ళినా భరిస్తారు, సంఘం కుళ్ళినా భరిస్తారు అన్న ఆ మాటల్లో ఒక చేదు సత్యముంది. కోస్తా తీరం నుండి కోటి చౌరస్తా వరకు నిలబడే వారు హక్కుల కోసం వీధుల్లోకి రారు. పోరాటాల్లోకి దిగరు అన్న విమర్శ అతిశయోక్తి కావచ్చు. కానీ పూర్తి అబద్ధమని తోసిపుచ్చడం కూడా కష్టమే. ప్రత్యేక హోదా అంశంలో సీమాంధ్ర వీధుల్లో మండిన నిప్పు ఎక్కడ? మళ్ళీ మళ్ళీ మోసపోయినా ఓటు వేసే చేతులు మాత్రం సిద్ధంగా ఉన్నాయి కానీ హక్కు కోసం పిడికిలి బిగించే సాహసం కనబడలేదు.

తెలంగాణ పోరాటం ఒక చారిత్రక పాఠం. పదమూడేళ్ళు అలుపెరగకుండా నడిచిన ఉద్యమం. వేలమంది యువత ప్రాణాలు అర్పించిన పోరాటం, మడమ తీయకుండా బిగించిన పిడికిలి. అది తెలంగాణ సాధించిన నైతిక బలం. ఆ పోరాట స్ఫూర్తిని ఇప్పుడు కొందరు తమకు అనువుగా వాడుకుంటున్నారు. తెలంగాణ నేర్పించాలంటే ముందు తమ హక్కు కోసం పోరాడటం నేర్చుకోండి.. అది మాత్రం అక్షర సత్యం.

పవన్ కళ్యాణ్ అభిమానులకు ఒక్క మాట. సినిమా హీరో వేదికపై చెప్పిన మాటలు నిజ జీవితంలో నిలబెట్టుకోవాలి. అధికారంలో ఉండి మాట్లాడకపోతే అది పాత్ర పోషణే అవుతుంది. నాయకత్వం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇప్పుడు అడగాల్సిన ప్రశ్న ఒక్కటే. మాకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటావా లేదా? ఆ జవాబు రాకపోతే రాజకీయ జీవితం నడిబజారు పాలవుతుందని గుర్తుచేసే హక్కు ప్రజలకు ఉంది. ఉండాలి, ఉంటుంది.

## అసలు నిజం!

మాకు తెలీదు
మేమంతా
మట్టిమనుషులం!
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
మేం బానిసలం!
జంతువులకంటే
హీనాతిహీనులం!
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
మేం కూలీ నాలీలం!
కూలిడబ్బులతో
కడుపునింపుకుంటాం!
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
మేం కార్మికులం!
యంత్రభూతాలతో
గంటలుగంటల పని!
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
భూములు మీవి
ఫ్యాక్టరీలు మీవి
టెక్నాలజీ మీది
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
మీదగ్గర ఉద్యోగులు
జీతాలు
తీసుకుంటారు
విరమణ తర్వాత
పెన్షన్ తీసుకుంటారు
వీళ్లు మేధావులు
నోరువిప్పరు!
మీదోపిడీగురించి
మీతప్పులు గురించి
మీమోసాలగురించి
మీదుర్మార్గాలగురించి
మీ'రేప్' ల గురించి
తెలిసిందే వీళ్లు!
నోరువిప్పకుండా
ఉండటానికే
నెలనెలా జీతాలు
అనుబంధంగా
లంచాలు
పోయేదాకా పెన్షన్లు!
మీరందరూ కలిసి
వేల సంవత్సరాల
క్రితమే –మాకు
చదువులొద్దని
సూద్రుల్ని చేసి
దూరంగా ఉంచారు!
మాకెలాతెస్తుంది
అసలునిజం!
తెలిస్తే మీరు
ఊరుకుంటారా?
కొత్త అవతారం
ఎత్తరూ!
ఆ రోజూ
దగ్గరపడింది!
అందుకే నిర్లజ్జగా
పట్టపగలే
దొంగల
దోపిడీ!
ప్రజాస్వామ్యం ఖునీ!
ఎన్నికల్లో మోసం!
దొంగఓటు!
'సర్' మాయ!
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
రాజ్యాంగవ్యవస్థలన్నీ
మీ గుప్పెటి లోకి
కాస్తో కూస్తో
నోరువిప్పేవాళ్లకి
బ్రహ్మ రథాలు
కోరిన వరాలు!
మాకెలా తెలుస్తుంది
అసలునిజం!
మీరుమీరు ఒకటి!
మేం మట్టిమనుషులం
కూలీలం బానిసలం
కష్ట జీవులం!
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
రాజ్యాంగం పై దాడి
అంబేద్కర్ ఏడి?
దోచుకోండి
దోచుకోండి
మేంనోరువిప్పి
అడగం!
మాకు నాయకులేరీ!
ఒకవేళ ఉన్నా
మీరు కొనేస్తారు!
మాకెలాతెలుస్తుంది
అసలునిజం!
మా పేదల్ని
ఈ మాత్రమన్నా
బ్రతకనిస్తున్నారంటే
అది మీకోసం!
మా 'శ్రమల' కోసం!
అదేలేకపోతే
దరిద్రులందర్నీ
కులమతాలతో
పనిలేకుండా
కుప్పపోసిఎప్పుడో
తగలబెట్టేసే వారు!
మాలోమేమే
కొట్టుకుచచ్చే
ఏర్పాట్లు చేసారు
అదే అసలునిజం!
మా దుఃఖాల గాథ!
కార్చేకన్నీటి వ్యధ!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ఆంధ్రప్రదేశ్‌లో శవాలపై రాజకీయాలు

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరం. తమ కుటుంబాలను పోషించేందుకు ప్రతిరోజూ ప్రమాదాలతో పోరాడే కార్మికులు ఒక్క క్షణంలో మృతిచెందడం కేవలం ఒక పరిశ్రమ ప్రమాదం మాత్రమే కాదు. అది సమాజం, ప్రభుత్వం, యాజమాన్యం, రాజకీయ వ్యవస్థలన్నింటికీ ఒక గట్టి హెచ్చరిక. కానీ ఇలాంటి విషాద సందర్భాల్లో ప్రజల దృష్టి బాధిత కుటుంబాల కన్నీళ్లపై కాకుండా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు–ప్రత్యారోపణలపై మళ్లిపోవడం మరింత బాధాకరం.



ఒక ప్రమాదం జరిగిన వెంటనే ముందుగా జరగాల్సింది ఏమిటి? బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందాలి. ప్రమాదానికి కారణాలు ఏమిటో స్వతంత్ర విచారణ జరగాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. కానీ మన రాజకీయ సంస్కృతిలో ఇవన్నీ రెండో స్థానానికి వెళ్లిపోతాయి. మొదటి స్థానంలో ఎవరు తప్పు చేశారు? ఎవరిని విమర్శించాలి? ఎవరు రాజకీయ లాభం పొందాలి? అనే అంశాలే నిలుస్తాయి.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా అదే జరిగింది. అధికార పార్టీ ఒక వైపు, ప్రతిపక్ష పార్టీ మరో వైపు నిలబడి పరస్పరం నిందలు వేసుకోవడం ప్రారంభించాయి. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఇది ఎంత బాధ కలిగిస్తుందో ఎవరూ ఆలోచించడం లేదు. వారి ఇంట్లో ఒక ప్రాణం పోయింది. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. కానీ రాజకీయ నాయకుల దృష్టిలో అది ఒక మానవ విషాదం కాకుండా ఒక రాజకీయ అవకాశంగా మారిపోవడం మన ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

అధికారంలో ఉన్నవారికి బాధ్యత ఎక్కువ. ఎందుకంటే ప్రస్తుతం పరిపాలన వారి చేతుల్లో ఉంది. పరిశ్రమల భద్రత, తనిఖీలు, కార్మిక సంక్షేమం, ప్రమాద నివారణ చర్యలు సమర్థంగా అమలవుతున్నాయా లేదా అనే ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాలి. ప్రమాదం జరిగిన తర్వాత కేవలం సానుభూతి ప్రకటనలు చేయడం సరిపోదు. గతంలో ఎన్ని భద్రతా తనిఖీలు జరిగాయి? ఎలాంటి లోపాలు గుర్తించారు? వాటిని సరిదిద్దారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారు ప్రశ్నలకు సమాధానం చెప్పడం బాధ్యత, ఉపకారం కాదు. అదే సమయంలో ప్రతిపక్షాల పాత్ర కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రతి విషాదాన్ని రాజకీయ లాభం కోసం ఉపయోగించుకోవడం ప్రజలకు విసుగు తెప్పిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు. కానీ కేవలం విమర్శలకే పరిమితం కాకుండా పరిష్కార మార్గాలను కూడా సూచించాలి. కార్మిక భద్రతను బలోపేతం చేయడానికి ఏ చర్యలు అవసరమో చెప్పాలి. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ఒత్తిడి తేవాలి. అలా కాకుండా కెమెరాల ముందు విమర్శలు చేసి, కొన్ని రోజుల తర్వాత ఆ అంశాన్ని మరిచిపోవడం ప్రజల సమస్యలను పరిష్కరించదు.

ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న కూడా ఉంది. దేశవ్యాప్తంగా పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు ఎందుకు పునరావృతమవుతున్నాయి? కార్మికుల ప్రాణాలకు నిజంగా ఎంత విలువ ఇస్తున్నాం? ఉత్పత్తి లక్ష్యాలు, లాభాలు, ఖర్చుల తగ్గింపు పేరుతో భద్రతా ప్రమాణాలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయా? అనేక పరిశ్రమల్లో కార్మిక సంఘాలు పదేపదే భద్రతా లోపాల గురించి హెచ్చరిస్తుంటాయి. కానీ ప్రమాదం జరిగే వరకు వాటిని పట్టించుకోరు. ప్రమాదం జరిగిన తర్వాత మాత్రమే అందరూ చురుకుగా మారతారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ అన్నీ మామూలు స్థితికి చేరుకుంటాయి.

విశాఖ ఉక్కు కర్మాగారం కేవలం ఒక పరిశ్రమ కాదు. అది లక్షలాది ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన సంస్థ. "విశాఖ ఉక్కు –ఆంధ్రుల హక్కు" అనే నినాదంతో ఎన్నో పోరాటాలు జరిగాయి. అనేక మంది ప్రాణత్యాగాలు చేశారు. అలాంటి సంస్థలో కార్మికులు అసురక్షిత పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తే అది కేవలం యాజమాన్యం సమస్య కాదు; ప్రభుత్వాల వైఫల్యాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. భద్రతను వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. ఒక కార్మికుడి ప్రాణం ఏ ఉత్పత్తి లక్ష్యానికన్నా, ఏ లాభానికన్నా విలువైనదే.

ఈ విషాదం మన రాజకీయ వ్యవస్థకు కూడా ఒక అద్దం పట్టింది. ప్రజల కష్టాల సమయంలో రాజకీయ నాయకులు ఎంతవరకు మానవత్వంతో వ్యవహరిస్తున్నారు? అనే ప్రశ్నను ముందుకు తెచ్చింది. ప్రజలు ఇప్పుడు కేవలం పరస్పర ఆరోపణలను వినాలనుకోవడం లేదు. వారు జవాబుదారీతనం కోరుతున్నారు. భద్రతా సంస్కరణలు కోరుతున్నారు. బాధ్యులపై చర్యలు కోరుతున్నారు. బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక భరోసా కోరుతున్నారు.

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులను తిరిగి తీసుకురావడం ఎవరి వల్లా కాదు. కానీ వారి మరణాలు వృథా కాకుండా చేయడం మాత్రం సమాజం చేతిలో ఉంది. అందుకు రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం మానేసి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఏం చేయాలో చర్చించాలి. కార్మిక భద్రతను ఎన్నికల అంశంగా కాకుండా మానవ హక్కుల అంశంగా చూడాలి. అధికార పార్టీ తన బాధ్యతను స్వీకరించాలి. ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. యాజమాన్యం పారదర్శకంగా ఉండాలి.

విషాద సమయంలో రాజకీయ పోరాటాలు ప్రజల గాయాలపై ఉప్పు చల్లినట్లే. ప్రజలకు కావాల్సింది వాదనలు కాదు, బాధ్యత. ప్రకటనలు కాదు, చర్యలు. సానుభూతి మాటలు కాదు, భద్రతా హామీలు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో మరణించిన కార్మికులకు నిజమైన నివాళి అంటే వారి పేరుతో మరికొంత రాజకీయం చేయడం కాదు; ఇకపై ఒక్క కార్మికుడైనా ఇలాంటి నిర్లక్ష్యానికి బలికాకుండా వ్యవస్థను మార్చడం. అదే ఈ విషాదం మనకు నేర్పాల్సిన గొప్ప పాఠం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ప్రజల సర్కార్ కావాలి.. ప్రచార సర్కార్ కాదు!

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం అనేది కేవలం అధికారాన్ని నిర్వహించే యంత్రాంగం కాదు. అది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం, రాజ్యాంగ విలువలకు సంరక్షకురాలు, సామాజిక న్యాయానికి మార్గదర్శి. ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రతి ప్రభుత్వం ప్రజల తరపున పాలించే బాధ్యతను స్వీకరిస్తుంది. ఆ బాధ్యతలో ప్రధానమైనది ప్రజల సమస్యలను పరిష్కరించడం, సంక్షేమాన్ని పెంపొందించడం, అభివృద్ధిని సమానంగా అందించడం. అయితే ఆధునిక కాలంలో అనేక దేశాల్లో పాలన కంటే ప్రచారానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల అమలుకన్నా వాటి ప్రచారంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడం ప్రజాస్వామ్య నాణ్యతను ప్రభావితం చేస్తోంది. ఒక పథకం ప్రారంభానికి ముందు ప్రచారం, ప్రారంభం తర్వాత ప్రచారం, అమలులో ప్రచారం, చివరికి విజయోత్సవ ప్రచారం జరుగుతోంది. ప్రజలకు సమాచారం అందించడం అవసరమైనప్పటికీ, అదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారకూడదు. ప్రజలు చివరకు చూసేది ప్రకటనలు కాదు; తమ జీవితాల్లో వచ్చిన మార్పు.



చరిత్రను పరిశీలిస్తే ప్రజల నమ్మకాన్ని సంపాదించిన ప్రభుత్వాలు ప్రచారంతో కాదు, పనితీరుతో నిలిచాయి. స్వాతంత్ర్యం తర్వాత 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ప్రజల విశ్వాసమే. అప్పటి ప్రభుత్వాల వద్ద ఆధునిక ప్రచార సాధనాలు లేకపోయినా, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం ప్రధానంగా ఉండేది. గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, సాగునీరు, మౌలిక వసతులపై దృష్టి పెట్టడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది. ఆ కాలంలో ప్రభుత్వం చేసిన ప్రతి పని ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పును తీసుకువచ్చేది. అందుకే ప్రచారం లేకున్నా ప్రజలు ప్రభుత్వాన్ని గౌరవించేవారు.

ప్రస్తుతం సమాచార సాంకేతిక విప్లవం కారణంగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టెలివిజన్, సోషల్ మీడియా, డిజిటల్ ప్రచార వేదికలు, అధికారిక ప్రకటనలు, భారీ ఈవెంట్లు ప్రభుత్వ కార్యకలాపాల్లో భాగమయ్యాయి. ఒక పథకం ప్రారంభానికి ముందు ప్రచారం, ప్రారంభం తర్వాత ప్రచారం, అమలులో ప్రచారం, చివరికి విజయోత్సవ ప్రచారం జరుగుతోంది. ప్రజలకు సమాచారం అందించడం అవసరమైనప్పటికీ, అదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారకూడదు. ప్రజలు చివరకు చూసేది ప్రకటనలు కాదు; తమ జీవితాల్లో వచ్చిన మార్పు. ప్రపంచంలోని అనేక అధ్యయనాలు ఒక ముఖ్యమైన విషయాన్ని సూచిస్తున్నాయి. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం ఎక్కువగా ఉండే దేశాల్లో పారదర్శకత, బాధ్యతాయుత పాలన, అవినీతి నియంత్రణ, సమర్థవంతమైన సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రచారం మాత్రమే విశ్వాసాన్ని పెంచలేదని అనేక అంతర్జాతీయ పరిశోధనలు పేర్కొన్నాయి. ప్రజలు ప్రభుత్వాన్ని అంచనా వేసేది తమ అనుభవాల ఆధారంగానే తప్ప ప్రకటనల ఆధారంగా కాదు. ఒక రైతు పంటకు సరైన ధర పొందితే అతనికి ప్రభుత్వం గొప్పగా కనిపిస్తుంది. ఒక విద్యార్థికి నాణ్యమైన విద్య అందితే అతను ప్రభుత్వాన్ని విశ్వసిస్తాడు. ఒక నిరుద్యోగికి ఉపాధి లభిస్తే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. ఒక రోగికి సమయానికి వైద్యం అందితే అతనికి ప్రచారం అవసరం ఉండదు. ప్రజల జీవితాలను మెరుగుపరచే పాలన ఏ ప్రకటనకన్నా శక్తివంతమైన ప్రచారం అవుతుంది. భారతదేశంలో సుమారు 65% జనాభా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తోంది. వారికి ప్రభుత్వ ప్రచారాల కంటే తాగునీరు, విద్యుత్, ఆరోగ్యం, రహదారులు, సాగునీరు, ఉపాధి వంటి అంశాలే ముఖ్యమైనవి. ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు ఇచ్చిందన్నది గ్రామీణ ప్రజలకు పెద్దగా ప్రాధాన్యం కాదు. వారి గ్రామంలో మార్పు వచ్చిందా లేదా అన్నదే అసలు ప్రమాణం. ప్రభుత్వ ఖజానాలోని ప్రతి రూపాయి ప్రజల పన్నుల ద్వారానే వస్తుంది. ఆ నిధులను ప్రధానంగా ప్రజా సంక్షేమానికి వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ప్రచారం కోసం అధిక వ్యయం జరిగితే ప్రజల్లో సహజంగానే ప్రశ్నలు తలెత్తుతాయి. అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులు ప్రకటనల కోసం వెళుతున్నాయనే భావన ఏర్పడితే ప్రజల విశ్వాసం తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రచారం అవసరమైనంత వరకు మాత్రమే పరిమితం కావాలి.

ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు, ప్రభుత్వం వారి సేవకురాలు అనే భావన ఎల్లప్పుడూ బలంగా ఉండాలి. ప్రజలను ప్రభావితం చేయడం కంటే ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యంగా మారినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రచార సర్కార్ కంటే ప్రజల సర్కార్ అనే గుర్తింపే ఏ ప్రభుత్వానికైనా శాశ్వత గౌరవాన్ని తీసుకువస్తుంది.


ప్రజల సర్కార్ అంటే ప్రజలతో నిరంతరం సంభాషించే ప్రభుత్వం. ప్రజల అవసరాలను అర్థం చేసుకునే ప్రభుత్వం. తప్పులు జరిగితే వాటిని అంగీకరించి సరిదిద్దుకునే ప్రభుత్వం. అధికారాన్ని వినయంతో వినియోగించే ప్రభుత్వం. సంక్షోభ సమయాల్లో ప్రజలతో కలిసి నిలిచే ప్రభుత్వం. ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, ఎన్నికల తర్వాత కూడా ప్రజల మధ్య ఉండే ప్రభుత్వం. ఇలాంటి ప్రభుత్వమే ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తుంది. ఒక ప్రభుత్వం నిజంగా ప్రజల ప్రభుత్వంగా నిలవాలంటే పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థత, నిష్పాక్షికత, రాజ్యాంగ నిబద్ధత అనే 5 మూల సూత్రాలను పాటించాలి. ప్రతి శాఖ పనితీరు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ వ్యయాలపై స్పష్టమైన సమాచారం ఉండాలి. ప్రజా ధనాన్ని ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి. సంక్షేమ పథకాలు రాజకీయ అభిమానం ఆధారంగా కాకుండా అర్హత ఆధారంగా అమలుకావాలి. అప్పుడు మాత్రమే ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రజలు ఎప్పటికీ ప్రచారాన్ని కాదు, నిజాయితీని గుర్తుంచుకుంటారు. ప్రకటనలను కాదు, అభివృద్ధిని గుర్తుంచుకుంటారు. ప్రసంగాలను కాదు, పనితీరును గుర్తుంచుకుంటారు. అధికారాన్ని కాదు, సేవా భావాన్ని గౌరవిస్తారు. అందువల్ల ప్రతి ప్రభుత్వం ఒక విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ప్రజల కోసం ఆలోచించాలి, ప్రజల కోసం పనిచేయాలి, ప్రజలతో కలిసి ముందుకు సాగాలి. అప్పుడే ప్రభుత్వం నిజమైన అర్థంలో ప్రజల సర్కార్‌గా అవతరిస్తుంది. అలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు 100% విశ్వసిస్తారు. చరిత్ర కూడా గౌరవంతో గుర్తుంచుకుంటుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# "మా వాడలో మా రాజ్యం"

## సంఖ్యల నుంచి శక్తిగా మారే ప్రయాణం




చరిత్రలో అత్యంత ప్రమాదకరమైన విషయం అన్యాయం కాదు. అన్యాయాన్ని సహజమని నమ్మడం.అత్యంత విషాదకరమైన విషయం పేదరికం కాదు. పేదరికాన్ని విధి అనీ అంగీకరించడం..అత్యంత పెద్ద రాజకీయ సమస్య అధికారం లేకపోవడం కాదు.అధికారం మనకోసం కాదని తర తరాలుగా నమ్మించడం.అందుకే కొన్ని నినాదాలు ఎన్నికలకోసం పుట్టవు.అవి ఒక సమాజం తన గురించి తాను తిరిగి ఆలోచించడం ప్రారంభించినప్పుడు పుడతాయి. "మావాడలో మా రాజ్యం"కూడా అలాంటి ప్రశ్నే.ఇది కేవలం పాలకులను మార్చే కోరిక కాదు.పాలితుల మనస్తత్వాన్ని మార్చే ప్రయత్నం.

మనోవిజ్ఞాన శాస్త్రం (psychology) చెబుతున్న ఒక లోతైన సత్యం ఏమిటం టే ఏ అణిచివేత అయినా ముందుగా మనిషి మనసులో స్థిరపడుతుంది. తర్వాతే అది సమాజంలో వ్యవస్థగా మారుతుంది. చాలాకాలం పాటు అంచుల్లోకి నెట్టివేయబడిన వర్గాలు ఒక దశలో తమ స్తితిని సహజంగా భావించడం ప్రారంభిస్తాయి. అదే అణిచివేతయొక్క అత్యంత ప్రమాదకర రూపం. ఎందుకంటే అక్కడ సంకెళ్లు చేతులకు ఉండవు. ఆలోచనలకు ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో పుట్టే రాజకీయ నినాదాలు కేవలం అధికారాన్ని అడుగవు. ముందుగా ఆత్మవిశ్వాసాన్ని తిరిగి కోరుకుంటాయి. అందుకే "మా వాడలో మారాజ్యం" అనే భావనను కేవలంరాజకీయ అధికార కోరికగా అర్థం చేసుకోవడం సరిపోదు. ఇది ప్రాతిద్యం గురించిన ప్రశ్న. నిర్ణయాలు తీసుకునేచోట మన ఉనికి ఉందా లేదా అనే ప్రశ్న.మనగురించి మాట్లాడేవారు ఉన్నారు;కానీ మనతో మాట్లాడేవారు ఎంతమంది ఉన్నారు అనే ప్రశ్న.ప్రజాస్వామ్యం యొక్క అసలు పరీక్ష కూడా ఇక్కడే ఉంటుంది. ఎన్నికలలో ఓటు వేయడం ఒక భాగం మాత్రమే.నిర్ణయ ప్రక్రియలో భాగస్వా మ్యం కావడం మరొక భాగం. చరిత్రను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. పెద్ద మార్పులు ఎప్పుడూ సంఖ్యలవల్ల జరుగలేదు.ఆ సంఖ్యలు తమ ఉమ్మడి అనుభవాన్ని గుర్తించినప్పుడు మాత్రమే మార్పు జరిగింది. బాధ ఒకటే కావచ్చు.కానీ ఆ బాధకు రాజకీయ భాష దొరికినప్పుడే అది ఉద్యమంగా మారుతుంది. ఆకోణంలో చూస్తే "మా వాడలో మా రాజ్యం" అనే నినాదమొక రాజకీయ ప్రకటన కంటే ఎక్కువ.అది ఒక సామాజిక ప్రశ్న.ఒక చారిత్రక అసంతృప్తికి దొరికిన భాష.

ఈ సందర్భంలో 1997 సంవత్సరంలో మారోజు వీరన్న ఏర్పాటుచేసిన CPUSI (ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ) లో గత 20 సంవత్సరాలుగా ఆ పార్టీలో నిజాయితీగా పనిచేస్తున్న ప్రముఖ కవిగాయ కుడు, అధ్యయనశీలి,ఉద్యమకారుడు,యువ మేధావి డాక్టర్ గుడిపెల్లి రవి జోక్యం గమనించదగ్గది. ఎందుకంటే ప్రతి ఉద్యమానికి రెండు కాళ్ళు అవసరం. ఒకటి ప్రజల అనుభవం. రెండోది ఆ అనుభవానికి దిశనిచ్చే ఆలోచన. వీధిలో వినిపించే ఆవేదనకు ఒక రాజకీయ అర్థం ఇవ్వడం,విడి విడిగా ఉన్న అనుభవాలను ఒక సామూహిక చర్చగా మార్చడం, సంఖ్యలను సామాజిక శక్తిగా చూడడం.ఇవి కేవలం నినాదాలతో సాధ్యం కావు.వాటికి ఆలోచన, అధ్యయనం, సంభాషణ అవసరం అని గుర్తించిన వ్యక్తి. అయితే ఇక్కడ ఒక తాత్విక హెచ్చరిక కూడా ఉంది."మా రాజ్యం అంటే కేవలం మనవాళ్ళు అధికారంలోకి రావడం మాత్రమే కాదు ,చాలాసార్లుపాలకులు మారారు కానీ పాలనా సంస్కృతి మారలేదు. అందుకే అసలు ప్రశ్న"ఎవరు పాలిస్తున్నారు?కాదేమో"ఎలా పాలిస్తున్నారు"?అనేదే.గౌరవం, సమానత్వం, భాగస్వామ్యం అనే విలువలు అధికారంలో ప్రతిబింబించకపోతే,నినాదాలు మారినా జీవితాలు మారవు.

చివరికి "మా వాడలో మారాజ్యం" అనే నినాదం యొక్క బలం దాని పదాల్లో లేదు.అది మనుషులలో రేపే ఆత్మగౌరవంలో ఉంది. తన జీవితానికి విలువ ఉందని ఒక వ్యక్తి భావించినపుడు,తన భవిష్యత్తును తానే నిర్మించ గలనని ఒక తరం నిర్ణయించుకున్నప్పుడు,అక్కడినుండే అసలు మార్పు ప్రారంభమవుతుంది.ఎందుకంటే చరిత్ర చివరికి ఒక ప్రశ్న అడుగుతుంది"మీరు ఎంత మంది ఉన్నారు?అనికాదు. "మీ సంఖ్యను సామాజికంగా మార్చుకోగలరా? అని. ఈ ప్రశ్నకు సమాధానం వెతికే ప్రతి ప్రయాణం సంఖ్యలనుంచి శక్తిగా మారే ప్రయాణమే.



ఆయిరబోయిన బిక్షపతి
(అగల్ జోయా)
సెల్ : 7993248717

# విద్యా మా హక్కు – కొనాల్సిందేనా

విద్య అనేది ఒక వ్యాపారం కాదు, అదొక సామాజిక బాధ్యత మరియు హక్కు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఎ ప్రకారం ప్రతి బిడ్డకు ఉచిత,నిర్బంధ విద్యను అందించాలని స్పష్టం చేస్తోంది. కానీ నేటి సమాజంలో విద్యా వ్యవస్థ క్రమంగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్తూ,సామాన్యుడికి భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో విద్యా హక్కు చట్టం (ఆర్టిఇ) 2009 ఆశయాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు,శాస్త్రీయ విద్య ఆవశ్యకత మరియు ప్రభుత్వ పాఠశాలల మనుగడపై ఒక గంభీరమైన చర్చ అవసరం.

### రాజ్యాంగ నిబంధనలు విద్యా హక్కు చట్టం

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. దీనికోసం 86వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా మార్చారు. దీని ఆధారంగానే 2009లో 'విద్యా హక్కు చట్టం' అమల్లోకి వచ్చింది.

ఈ చట్టం ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయించడం చట్టవిరుద్ధం మరియు నేరం. విద్యను లాభాపేక్ష లేని సేవగా మాత్రమే నిర్వహించాలి. అలాగే,బడి బయట పిల్లలు లేకుండా చేయడం, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం మనందరి సామాజిక బాధ్యతగా ఈ చట్టం చెబుతోంది.

రాజ్యాంగం చెప్పిన ఉచిత, నిర్బంధ విద్యా విధానం నేడు క్షేత్రస్థాయిలో 'తూతూ మంత్రం'గా మారిందనేది పచ్చినిజం. కనీసం ప్లేస్కూల్స్, కిండర్ గార్టెన్ స్థాయిల్లో కూడా ఎలాంటి నిబంధనలు అమలు కావడం లేదు. చట్టాలు కాగితాలకే పరిమితమవుతుండటంతో, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందకుండా పోతోంది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై చాల మంది నాయకుల ప్రసంగాలు మాత్రమే వినబడుతున్నా, సరైన పర్యవేక్షణ లేక ఎంతో మంది బాలలు నేటికీ చదువుకు దూరమవుతూ పనికి వ్యసనానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు తప్ప వారి జీవితాలు ప్రమాదంలో పడ్డాయి అని గుర్తించలేకున్నారు కారణం సరైన విద్య లేక పోవడం.

### పుట్టగొడుగుల్లా కార్పొరేట్ విద్యా సంస్థలు

విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి , విద్యా రంగంలో సంపాదనే ధ్యేయంగా కొన్ని కార్పొరేట్ సంస్థలు రాజ్యమేలుతున్నాయి. ఉదాహరణకు శ్రీ చైతన్య, నారాయణ,లాంటి ఎన్నో పెద్ద పెద్ద విద్యా సంస్థలు మరియు మరెన్నో ప్రైవేట్ స్కూళ్లు గల్లీ గల్లీకి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి అలాగే ఇష్టాను సారంగాని పిల్లాడికి కూడా లక్షల రూపాయలు ఫీజ్ తీసుకుంటున్నారు రాజ్యాంగ నిబంధనల ప్రకారం విద్య ద్వారా లాభాలు సంపాదిస్తే జైలు శిక్ష పడే అవకాశం ఉన్నప్పటికీ, ఈ సంస్థలు లినాన్–ప్రాఫిటబుల్‌లి గా రిజిస్ట్రేషన్ చేయించుకుని, లోపల మాత్రం కోట్లాది రూపాయల విద్యా వ్యాపారాన్ని సాగిస్తున్నాయి. ఫీజుల దోపిడీ, పుస్తకాలు–యూనిఫామ్‌ల విక్రయాల ద్వారా సామాన్యుల రక్తాన్ని పిండుకుంటున్నాయి.

### ప్రభుత్వాల విధానాలు - పాఠశాలల మూసివేత

ఒకవైపు ప్రైవేట్ పాఠశాలలు పెరుగుతుంటే, మరోవైపు ప్రభుత్వాలు సర్కారు బడులను బలోపేతం చేయాల్సింది పోయి, వాటిని మూసివేయడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 5 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా దాదాపు 23 వేల పాఠశాలలను మూసివేయాలనే ప్రభుత్వ నిర్ణయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. గత ప్రభుత్వం చేసిన తప్పులను మేము చేయము మూతబడ్డ పాఠశాలలను పునఃప్రారంభిస్తాం అని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అదే తరహాలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం అంటే, గ్రామీణ మరియు పేద విద్యార్థులను శాశ్వతంగా చదువుకు దూరం చేయడమే.

బాన్సువాడ వేదాంత్ మౌర్య
సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు
9963513544

# మహిళలు, చిన్నారులకు భరోసా కేంద్రం అండగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక
- భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రం లోని గాయత్రి నగర్‌లో ఉన్న భరోసా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మంగళవా రం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా కేంద్రం లోని రికార్డులు, కేసుల నిర్వహణ విధానం, బాధితు లకు అందిస్తున్న సేవలు, కౌన్సిలింగ్ ప్రక్రియ, న్యాయ సహాయం, వైద్య సేవల సమన్వయం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భరోసా కేంద్రం ఇన్‌చార్జి ఎస్ఐ శిరీష, కౌన్సిలర్ అండ్ కోఆర్డినేటర్ ప్రమీల కలెక్టర్‌కు భరోసా కేంద్రం కార్యకలాపా లపై వివరాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఈ సంవత్సరం ఇప్పటివరకు జిల్లాలో 37 పోక్సో కేసులు, 4 అత్యాచార కేసులు నమోదు అయ్యవని వాటికి సంబంధించి బాధితు లకు అవసరమైన కౌన్సిలింగ్, న్యాయపరమైన సహాయం అందించడంతో పాటు ప్రభుత్వం ద్వారా అందించే పరిహారం కోసం సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.పోలీస్ స్టేషన్లలో నమోద య్యే పోక్సో, అత్యాచార కేసుల బాధితుల స్టేట్‌మెంట్ల ను భరోసా కేంద్రంలో సురక్షిత వాతావరణంలో నమోదు చేస్తున్నామని, అలాగే షీ టీమ్స్‌తో కలిసి మహిళలపై జరుగుతున్న నేరాల నివా రణకు అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మహిళలు చిన్నారులకు మరింత మెరు గైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ముఖ్యంగా లైంగిక దాడులు, గృహ హింస, వేధింపులకు గురైన మహిళలకు అవసరమైన వైద్య సేవలు తక్షణమే అందేలా ప్రత్యేక వైద్యుల సహకా రాన్ని భరోసా కేంద్రానికి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పరిధిలో కుటుంబంలో, కార్యాలయంలో, విద్యా సంస్థల్లో లేదా ఇతర సామా జిక వేదికలలో హింస, వివక్ష, లైంగిక వేధింపులు, మానసిక లేదా శారీరక ఇబ్బందులకు గురైన మహిళలకు భరోసా కేంద్రం ద్వారా సమగ్ర సహా య సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. భరోసా కేంద్రంలో 24 గంటల పాటు మహిళా పోలీసులు అందు బాటులో ఉంటూ బాధిత మహిళలు, చిన్నారులకు భద్రతా భావన కల్పిస్తున్నా రని తెలిపారు. అత్యాచా రాలు, లైంగిక వేధింపులు, గృహహింస వంటి ఘటన లకు గురైన మహిళలు, చిన్నారులకు సరైన సమయంలో రక్షణ, వైద్య న్యాయ సహాయం అందించి నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకావాల ని తెలిపారు. బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చి, వారు తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చేలా భరోసా కేంద్రం ద్వారా అన్ని విధాలా సహకారం అందించాలని వెల్లడించారు. బాధిత మహిళలకు కంపోజిషన్ ప్రభుత్వ సహాయం అందిం చాలని సూచించారు.హింస లేదా వేధింపులకు గురైన మహిళలు, చిన్నారు లు ఎలాంటి భయాందోళ నలకు గురికాకుండా ధైర్యం గా భరోసా కేంద్రాన్ని సంప్ర దించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ సతీష్ రెడ్డి,ఇన్‌చార్జి ఎస్ఐ శిరీష, కౌన్సిలర్ అండ్ కోఆర్డినేటర్ ప్రమీల, సపోర్ట్ పర్సన్ అశ్విని, నాగలక్ష్మి, రిసెప్షనిస్ట్ రాధిక, ఏ ఎం ఎం శారద, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**కాప్రా, జూన్ 16 (జనం సాక్షి) :** మల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ కాలనీలో స్థానిక నాయకులతో కలిసి మాజీ జెర్రీపోతుల ప్రభుదాస్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వారు కాలనీలోని సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ, విద్యుత్ కి సంబంధిత అధికారులకు సమన్వయం చేసి, వెంటనే సమస్యల పై చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కాలనీ అధ్యక్షులు వాసు చారి, సెక్రటరీ మధు ముదిరాజ్ స్థానిక నాయకులు భానూరి రాకేష్, రిజ్వాన్, నరేష్, శ్రీకాంత్ గౌడ్, భీష్మాచారి, యాదయ్య మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



## ప్రజలకు మౌలిక కనీస వసతులు కల్పించాలి



**నిజాంపేట్, జూన్ 16 (జనం సాక్షి) :** నిజాంపేట సర్కిల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ , మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాగు నీరు సరఫరా లో వివక్ష చూపడం 6-7 రోజులకు కానీ నీరు విడుదల చేయడం లేదు,అవికూడా సరైన ప్రెషర్ రావడం లేదు. స్లమ్స్ లో కాలనీలలో నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.ఈ సమస్య ను వెంటనే పరిష్కరించాలి అని డిమాండ్ చేశారు. మురుకు నీరు నిర్వహణ కూడా చాలా దారుణంగా ఉంది ఎక్కడికక్కడ డ్రైనేజీ పొంగుతుశీదని, కాలనీ లలో డ్రైనేజీ నీరు పారుతున్న. ఈ సమస్య ను కూడా అధికారులు దృష్టి పెట్టి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇక ముఖ్యమైన సమస్య కాలనీలనుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డు కి తరలించడం కానీ డంపింగ్ యార్డు నుంచి ఆ చెత్తను తొలగించడం కానీ పద్ధతి ప్రకారం చేయడం లేదని, వెంటనే డంపింగ్ యార్డు ను అక్కడ నుంచి తరలించి డబల్ బెడ్ రూమ్ వాసులకు పరిసర ప్రాంతాల కాలనీల ప్రజలకు ఆదుకోవాలి అని కోరారు. రోడ్లు ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డా.యని,ఈ వర్షాలు వచ్చే లోపు కనీసం ఆ గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమములో మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు ,సుజాత , మాజీ కోఆప్షన్ సభ్యులు సలీం పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు , మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గృహ కార్మికుల సామాజిక భద్రతకు చట్టం చేయాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




**ముషీరాబాద్, జూన్ 16 (జనం సాక్షి) :** గృహ కార్మికుల సమగ్ర సంక్షేమానికి, సామాజిక భద్రతకు గృహ కార్మికుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో గృహ కార్మికుల జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి లేక అనేక కుటుంబాలు పట్టణాలకు వలసలకు వచ్చి మహిళలు గృహ కార్మికులుగా, పురుషులు వాచ్మెన్ లుగా జీవిస్తూ అర్ధాకలితో అల్లాడిస్తున్నారని అన్నారు. అనేక పోరాటలతో రాష్ట్ర ప్రభుత్వం గిగ్ కార్మికులకు చట్టం చేసినట్లే గృహ కార్మికుల చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం రూపొందించి అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి గృహ కార్మికుల సమగ్ర చట్టాన్ని తీసుకువచ్చే విధంగా తమ కమిషన్ పనిచేస్తుందని చెప్పారు. మానవ హక్కుల వేదిక రెండు రాష్ట్రాల సమన్వయకర్త జీవన్ కుమార్ మాట్లాడుతూ గృహ కార్మికులను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా గృహ కార్మికులు పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదని అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం గృహ కార్మికులకు, చెత్త సేకరణ కార్మికులందరూ ప్రజా లందరూ ఆత్మ గౌరవంతో జీవించాలనీ రాజ్యాంగం ఆదేశిస్తున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల లక్ష్యాలు నెరవేరడం లేదన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ గృహ కార్మికులకు కనీస వేతనాలు లేక సొంత ఇల్లు లేక నరకాయాతన పడుతున్నందున వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ లు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. వారి సామాజిక భద్రతకు ఇన్సూరెన్స్ అమలు చేయాలనీ కోరారు. హైదరాబాద్ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన మాట్లాడుతూ గృహ కార్మికులపై దొంగతనం పేరుతో పోలీసులు యజమానులు వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యంగా తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సదస్సులో భారత రాజ్యాంగ పీఠిక పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ నాయకులు రాజేష్, కృష్ణ, యాదమ్మ, శారద, మీనా, రంగమ్మ, సుధాకర్ ,రవి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలను అరికట్టాలి

- రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు
- జిల్లా వ్యవసాయ అధికారికి రైతు సంగం వినతి పత్రం



**సంగారెడ్డి, జూన్ 16 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అదిక ధరలకు అమ్ముతున్న పెర్టీ లైజర్ షాప్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్‌కి వినతి పత్రం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఫెర్టిలైజర్ షాపు యాజమాన్యాలు అధిక ధరలకు ఎరువులు విత్తనాలను విక్రయిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు.డీ ఏ పి, యూరియాను అధిక రేట్లకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు ఎరువులు పురుగుమందులు అమ్మకుండా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. లైసెన్సు లేకుండా నడుస్తున్న షాపులపై క్రిమినల్ కేసులో నమోదు చేయాలని అన్నారు. రైతులు మోసపోకుండా నకిలీ విత్తనాల బారిన పడకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటనలు చేయాలని అన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ఎరువులు విత్తనాలు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ సంవత్సరం వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని పెసలు మినుములు , కందులు సోయాబీన్ వంటి విత్తనాలను అధిక మొత్తము అధికారులు అందుబాటులో ఉంచాలని అన్నారు.ఈ కార్యక్రమం లో రైతు సంగం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, నాయకులు యాదయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దానంపల్లి మహిళా సంఘాల్లో భారీ కుంభకోణం

- బ్యాంకు ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించిన మహిళలు
- రూ. కోటి పైనా స్వాహా చేసినట్లు ఆరోపణ



**చేర్యాల, జూన్ 16 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని దానంపల్లి గ్రామ మహిళా సంఘాల సీఏలు, గ్రామైక్య సంఘం సీసీ కలిసి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ చేర్యాల మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట జాతీయ రహదారిపై మహిళా సంఘాలు రోడ్డుపై బైఠాయించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దానంపల్లి సీఏ లింగాల మమత, గుర్జకుంట సీఏ పాముల రాధిక, గ్రామైక్య సంఘాల సీసీ మాదాసు దేవయ్య లు కలిసి అధ్యక్ష కార్యదర్శులు, సభ్యుల ప్రమేయం లేకుండా నిరక్షరాస్యులైన మహిళల సంతకాలు ఫోర్జరీ చేసి, మరికొన్ని గ్రూపుల్లో లోన్ లు మంజూరు చేస్తామని పెద్ద మొత్తంలో డ్రా చేసుకొని కొంతమెరకే ఇచ్చినట్లు ఆరోపించారు. ఇలా 23 మహిళా సంఘాల నుంచి ఒక్కో సంఘానికి కొన్ని లక్షల చొప్పున డ్రా చేసి సుమారు రూ. కోటి 20 లక్షల కుంభకోణానికి పాల్పడ్డట్లు తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేసి, భాద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సంఘటనా స్థలానికి చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి చేరుకొని బ్యాంకు మేనేజర్ సంబంధిత అధికారులతో మాట్లాడించారు. న్యాయం జరిగే విధంగా కృషి చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## హై-రిస్క్ బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్స విజయవంతం

- మహబూబ్‌నగర్‌కు చెందిన 53 ఏళ్ల రోగికి యశోదా ఆసుపత్రిలో ఆపరేషన్




**మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 16 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా ముందారి తండాకు చెందిన 53 ఏళ్ల ముడావత్ రాజు నాయక్‌కు హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో క్లిష్టమైన హై-రిస్క్ బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో తీవ్రమైన అడ్డంకులు ఏర్పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి ఈ శస్త్రచికిత్స ద్వారా కొత్త జీవితం లభించినట్లు వైద్యులు తెలిపారు. వైద్యుల వివరాల ప్రకారం, రోగి తీవ్రమైన ఛాతినొప్పి, చెమటలు పట్టడం, తల తిరగడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి చేరుకున్నాడు. పరీక్షల్లో కరోనరీ ఆర్టరీ డిసీజ్, అక్యూట్ కొరోనరీ సింద్రోమ్, యాంటీరియర్ వాల్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్, తీవ్రమైన వెంట్రిక్యులర్ సిస్టోలిక్ డిస్‌ఫంక్షన్, ట్రిపుల్ వెసెల్ డిసీజ్‌తో పాటు మధుమేహం, రక్తపోటు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. రోగి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో యశోదా ఆసుపత్రి కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి నాయకత్వంలో ఆఫ్-పంప్ కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ శస్త్రచికిత్స నిర్వహించారు. గుండెను ఆపకుండా బీటింగ్ హార్ట్‌పైనే నాలుగు కరోనరీ బైపాస్ గ్రాఫ్ట్‌లను అమర్చడం ఈ శస్త్రచికిత్స ప్రత్యేకతగా వైద్యులు పేర్కొన్నారు. అలాగే దెబ్బతిన్న కరోనరీ ధమనిలో ఎండార్టెరెక్టమీ నిర్వహించి, అత్యంత ప్రమాదకరమైన గుండె పరిస్థితిని సమర్థవంతంగా అధిగమించినట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణ, వెంటిలేటర్ సపోర్ట్, ఆక్సిజన్, యాంటీబయాటిక్స్, గుండె మందులు, ఛాతి ఫిజియోథెరపీ తదితర చికిత్సలు అందించడంతో ఆరోగ్యం మెరుగుపడిందని వెల్లడించారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ, గుండె సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చన్నారు. ఆధునిక సాంకేతికత, నిపుణులైన వైద్యుల సహకారంతో క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

# చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ పరారీ...

- తాండూర్ సబ్ రిజిస్టర్ ఆఫీసులో అనధికార విధులు
- ఆదివారం రోజున అనధికార విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు
- జూనియర్ అసిస్టెంట్ లాగిన్ ఓపెన్ చేసి తప్పుడు పనులు
- విధుల నిర్వహణలో గందరగోళంగా మారిన తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి) :** తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న చేవెళ్ల సబ్ రిజిస్టర్ శ్రీనివాస్ యాదవ్ ను మీడియా పసిగట్టడంతో కార్యాలయం నుంచి పరారీ అయిన సంఘటన మంగళవారం నాడు జరిగింది. తాండూర్ సబ్ రిజిస్టర్ అధికారిగా రుక్ముద్దీన్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు చేవెళ్ల సబ్ రిజిస్టర్ గా పనిచేస్తున్న శ్రీనివాస్ యాదవ్ అనధికార విధులను తాండూర్ లో నిర్వహిస్తున్నాడు. ఈ విషయాన్ని పసిగట్టిన స్థానికులు కొందరు మీడియాకు సమాచారం అందించడంతో మీడియా రాకను గమనించిన చేవెళ్ల సబ్ రిజిస్టర్ శ్రీనివాస్ యాదవ్ మీడియాను తప్పించుకొని రోడ్డుపై పరుగులు తీశారు. ఈ సన్నివేశాన్ని చూసిన కొందరు మళ్లీ తాండూర్ సబ్ రిజిస్టర్ ఆఫీసులో ఏసీబీ దాడులు జరిగాయా అని వాకబ్ చేశారు. కాగా గత రెండు సంవత్సరాలుగా తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం గందరగోళంగా మారింది. ఇక్కడ రెగ్యులర్ గా పూర్వ డిప్యూటేషన్ పై ఐజి ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఆయన అక్కడ పనిచేస్తూ ఇక్కడి సబ్ రిజిస్టర్ ఆఫీస్ కార్యాలయం నుంచి నెలసరి జీతం పొందుతున్నాడు. సబ్ రిజిస్టర్ పూర్వ నెలసరి వేతనంపై ఎస్ టి ఓ కార్యాలయం అధికారులు అభ్యంతరం తెలియజేశారు. తాండూర్ సబ్ రిజిస్టర్‌గా పనిచేయవలసిన ఆయన ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో అధికారిక ఆదేశాలు లేకుండానే నెలసరి వేతనం తీసుకోవడాన్ని ఎంటిఓ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నర్సింలు అనిత అనే ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లో రెగ్యులర్ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. ఇక్కడ రెగ్యులర్ సబ్ రిజిస్టర్ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది పనితీరు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది. కిందిస్థాయి సిబ్బంది ఆజామహిషి లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏసీబీ దాడులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడంలో కీలక పాత్ర పోషించి సస్పెండ్ అయిన కొందరు అధికారులు అనాధికారికంగా ఆదివారం సెలవు రోజున సిబ్బంది లేని సమయంలో రాత్రివేళ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని తెరిచి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. పని అవసరాలరీత్యా ఇక్కడ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ పాస్వర్డ్ లన్ని అక్కడ పనిచేసే సిబ్బందికి తెలుస్తుంది. కానీ ఇక్కడ సస్పెండ్ అయిన కొందరు అధికారులు ఇతర అధికారుల పాస్వర్డ్ తో కంప్యూటర్ ఓపెన్ చేసి సెలవు రోజున పనులు చక్కబెట్టుకోవడం చర్చనీ అంశంగా మారింది. కంప్యూటర్లకు పాస్వర్డు ఉంటాయి. రెండేసి కంప్యూటర్లకు వేలిముద్ర వేసి కంప్యూటర్ ఓపెన్ చేయగా మరో కంప్యూటర్ కు పాస్వర్డ్ ద్వారా కంప్యూటర్ను ఓపెన్ చేస్తారు. పాస్వర్డ్ తెలుసుకున్న కంప్యూటర్ న ఓపెన్ చేసి అక్రమంగా పనులు చక్క పెట్టుకుంటున్నారు. ఈ విషయమే సంబంధిత జూనియర్ అసిస్టెంట్ కు తెలవడంతో ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఆదివారం సెలవు రోజున పని చేసుకోవడానికి పరోక్షంగా సహకరించిన జూనియర్ అసిస్టెంట్ తో వాద్వివాదానికి దిగారు. ఇలా ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు సస్పెండ్ అయిన సెలవు దినం రోజున దర్జాగా కార్యాలయాన్ని తెరుచుకొని తమ పనులు చేసుకుంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏసీబీ దాడులు వివిధ ఫిర్యాదులతో సస్పెండ్ అయిన అధికారులు భయపడకుండా తమ అక్రమార్జన పనులను చక్కబెట్టుకొని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రోజుకు కొత్త కోణం బయటికి వస్తుంది. ఉన్నతాధికారులు ఈ సబ్ రిజిస్టర్ ఆఫీస్ పై నజర్ వేసి ఆదివారం సెలవు రోజున పని చేసిన వారిని వారికి సహకరించిన గుర్తించి చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం...

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

- కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి



**బొంరాస్‌పేట, జూన్ 16 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతిరెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో రూ.93 లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల తరగతి గదులను కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.అనంతరం విద్యార్థులకు ప్రభుత్వము అందజేస్తున్న పాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డిని ఎంఈఓ హరిలాల్,సర్పంచ్ అనిత నర్సింలు ఘనంగా సన్మానించారు.సీఎం రేవంత్ రెడ్డికి విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన, ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, ఎంపీడీవో వెంకన్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
17 జూన్ 2026

# శాంతి భద్రతల పర్యవేక్షణలో వనపర్తి పోలీసులు భేష్

• ఐజీపీ షానవాజ్ ఖాసీం

**వనపర్తి బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రజలకు న్యాయం అందించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి పోలీసులు అండగా ఉన్నారనే నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని, మల్టీ జోన్-2 హైదరాబాద్ ఐజీపీ షానవాజ్ ఖాసీం పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, సత్వర పరిష్కార చర్యలు చేపడుతూ మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించడం ద్వారా పోలీసు-ప్రజా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన తెలిపారు. మంగళవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఐజీపీ షానవాజ్ ఖాసీం, జోగులాంబ జోన్-7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్,తో కలిసి సందర్శించి జిల్లా పోలీసు పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఐజీపీ, డీఐజీ పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఐజీపీ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి జిల్లాలో నమోదైన యూఐ, గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, కాంటెస్టెడ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సందర్భంగా ఐ జి పి మాట్లాడుతూ... పోక్సో ఎస్సీ/ఎస్టీ కేసుల్లో 60 రోజులలోపు




దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతి కేసుకు స్పష్టమైన "ప్లాన్ ఆఫ్ యాక్షన్" ఉండాలని, రౌడీ షీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించాలని, రాత్రి గస్తీని మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. లాడ్జీలు, పాత నేరస్తులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల సందర్శనలకు ప్రాధాన్యత పోలీసు అధికారులు, వీఆర్వోలు, బీట్ అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ డేటా ఎంట్రీపై ప్రత్యేక దృష్టి పోలీస్ స్టేషన్ రికార్డులను నిరంతరం నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రికార్డుల నిర్వహణలో 5ఎస్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాల నివారణకు చర్యలు సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, రాత్రి గస్తీల ద్వారా ఆర్థిక నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసుల పనితీరుపై ప్రశంసలు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, చేపడుతున్న చర్యలపై ఐజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు వనపర్తి డిఎస్పీ, గిరిబాబు ఐజిపికి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఐజిపి డిఎస్పీ కార్యాలయంలో మొక్కలు నాటారు. గతంలో వనపర్తి ఏఎస్పీగా పనిచేసిన రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, ఐపీఎస్, ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ, గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ,సునంద, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, సీసీఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదిపై అక్రమ కేసు నిరసిస్తూ కోర్టు విధులు బహిష్కరణ



**నారాయణపేట, జూన్ 16 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్‌లో న్యాయవాది వి.నరేందర్ నాయక్ పై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం నారాయణపేట బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించారు. ప్రభుత్వం న్యాయ వాదుల పరిరక్షణ చట్టం తీసుకువచ్చినప్పటికీ మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై న్యాయవాదిపై అక్రమ కేసు నమోదు చేయడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. అక్రమ కేసు ఎత్తివే యాలని డిమాండ్ చేస్తూ కోర్టు విధులను న్యాయవా దులు బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, సీని యర్,జూనియర్ న్యాయ వాదులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌పై రైతులకు అవగాహన

• రైతులకు ఉచితంగా కంది విత్తనాల అందజేత



**న్యాల్‌కల్, జూన్ 16 (జనం సాక్షి) :** జాతీయ ఆహార భద్రతా పథకం, రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం న్యాల్ కల్ లోని రైతు వేదికలో యూరియా యాప్ పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జహీరాబాద్ డివిజన్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి బిక్షపతి రైతులకు యూరియా యాప్ పై అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా, జిల్లా వ్యవసాయ అధికారుల ఆదేశం మేరకు పప్పు దినుసుల సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ, సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, రైతులు హాజరయ్యారు.

## ప్రాథమిక విద్యే భవిష్యత్తుకు పునాది



**జడ్చర్ల, జూన్ 16 (జనంసాక్షి) :** జడ్చర్ల మండలంలోని బూర్గుపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి కె. మంజులాదేవి ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులకు అక్షరాభ్యాసం ప్రాముఖ్యతను వివరించారు. వారి విద్యాభ్యాసం విజయవంతంగా కొనసాగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. విద్యకు పునాది ప్రాథమిక పాఠశాల నుంచే మొదలవుతుందని, చిన్నారుల భవిష్యత్తు బాగుండాలంటే ప్రాథమిక విద్యకు బలమైన పునాది అవసరమని అతిథులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ శంకర్, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ లక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, రాధాకృష్ణ, బొల్ల శంకర్, చెన్నయ్య, అకాడమిక్ మానిటరింగ్ అండ్ పేరెంట్ కమిటీ చైర్మన్ రామచంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న రాంచంద్రం



**చిన్నశంకరంపేట, జూన్ 16 (జనం సాక్షి) :** బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను గుర్తించిన లైయన్స్ ఇండియన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సరస్వతి ఆడిటోరియంలో జరిగిన బహుజన ఆత్మీయ సదస్సు కార్యక్రమంలో చిన్న శంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామానికి చెందిన ముత్తిగల రామచంద్రం అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికై నేడు అవార్డు టీఎన్జీవో అధ్యక్షులు డాక్టర్ ఆకుల రమేష్ కృష్ణ గోవర్ధన్ సామ్రాట్ చేతులమీదుగా అందుకున్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన సేవలను గుర్తించిన లైయ న్స్ ఇండియన్ ఈ అవార్డు తనకిచ్చి మరింత భారం పెంచిందన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో కాడిగళ్ల మల్లేశం, కర్నే సాయిలు, తదితరులున్నారు.

## విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరుగుతున్న నూతన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అలాగే విద్యార్థులకు పంపిణీ చేయుటకు అందిన కొత్త పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను తనిఖీ చేసి, కొందరు విద్యార్థులకు స్వయంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాలపై కలెక్టర్ ఆరా తీయగా, ప్రస్తుతం 702 మంది విద్యార్థులు ఉన్నారని, నిన్న పాఠశాల పునః ప్రారంభం కాగా ఇప్పటివరకు 65 మంది విద్యార్థులు కొత్తగా చేరారని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటుతుందని భావిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, ఈ విద్యా సంవత్సరంలో ఈ సబ్జెక్టుల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా చర్యలు తీసుకోవాలని



ఆదేశించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రవేశ సమయంలోనే అపార్ ఐడీలను రూపొందించాలని, యూ-డైస్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను సకాలంలో నమోదు చేసి నవీకరించాలని సూచించారు. పాఠశాలలకు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు లేదా ఇతర మౌలిక వసతులు అవసరమైతే జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వాటికి అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే విద్యార్థుల డ్రాప్‌బాక్స్‌లో ఎలాంటి పెండింగ్ అంశాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో, ఇంచార్జ్ డిఇఓ యాదయ్య, ప్రిన్సిపల్స్ ఉమాదేవి, చంద్రశేఖర్, ఇతర విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**తెలకపల్లి, జూన్ 16 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, రాకొండ గ్రామంలోని యూపిఎస్ పాఠశాలల్లో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎ. రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శు భారంభం చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసి, విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదును పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటుందన్నారు. సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని, విద్యార్థులు పాఠశాలకు నిత్యం హాజరై పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ఉపాధ్యాయులు కూడా బోధనలో వినూత్న పద్ధతులను అవలంబించి విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి



**బిజినేపల్లి, జూన్ 16 (జనం సాక్షి) :** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై జరుగుతున్న ఆర్థిక దోపిడీ, అక్రమ ఫీజుల వసూళ్ల పైవిచారణ జరిపి చర్యలు చేపట్టాలని విద్యార్థి తల్లిదండ్రులు ప్రవీణ్ కుమార్ రెడ్డి చంద్రశేఖర్లుమంగళవారం మండల కేంద్రంలో గల మండల విద్యాధికారి తిరుపతయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూడొనేషన్ బిల్డింగ్ ఫండ్ డెవలప్మెంట్ ఫండ్ పేర్లతో అక్రమ ఫీజులు వసూలు చేస్తున్న నిర్దిష్ట దుకాణాలనుంచి లేదా పాఠశాలల నుంచి పాఠ్యపుస్తకాలు,యూనిఫారంసులు కొనాలని తల్లిదండ్రులను బలవంతం చేయడం సరికాదన్నారు. ఫీజులు సకాలంలో చెల్లించని విద్యార్థులను తరగతులు,పరీక్షల నుండిదూరం పెట్టడంటిసిమార్కుల మెమోలు ఇవ్వకుండా నిలిపివేయడం అధికారిక రసీదులు ఇవ్వకుండా ఫీజులు వసూలు చేయడం జరుగుతుందని వీటి పైన ప్రత్యేక శ్రద్ధ మండల విద్యాధికారులు పెట్టాలనిఅధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు నాణ్యతతో, గడువు లోపు పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి) :** వనపర్తి మండలంలోని నాగమ్మ తండా గ్రామ పంచాయతీని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మంగళవారం సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం, వీవో భవనాల పనులను పరిశీలించి నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఏఈ (పీఆర్) అధికారికి సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ నర్సరీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, నర్సరీ నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. మొక్కల సంరక్షణ, వాటి పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఫీల్డ్ ఆఫీసర్, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో నర్సరీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, ఏఈ (పీఆర్) తదితర అధికారులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కూడా హాజరయ్యారు.

# ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి) :** విద్యార్థులు ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాన్ని సాధించా లని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణపేట మండలం లోని జాజాపూర్ జెడ్పీ ఉన్న త పాఠశాలను సందర్శించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూనూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ముందుగా జాజాపూర్ పాఠశాలకు వచ్చానని, ఈ పాఠశాల వచ్చే సంవత్సరం పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాల న్నారు. ఈ జిల్లా నుంచి గతంలో బాసర ట్రిపుల్ ఐ టి కి ఎంపిక అయ్యారని ఆమె గుర్తు చేశారు. జాజాపూర్ పాఠశాల నుంచి కూడా ట్రిపుల్ ఐటికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో ఉపాధ్యా యులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఇష్టంతో చదవాలన్నారు. బట్టి పట్టే విధానానికి స్వస్తి పలకా లన్నారు. లెక్కలను సులు వుగా ఎలా చేయాలో విద్యా ర్థులకు ఆమె ప్రాక్టికల్ గా చేసి చూపించారు. విద్యార్థు లకు పదో తరగతే పునాది లాంటిది




అన్నారు. రాబోయే పదేళ్లలో మీరు ఎలా ఉండాలో నోట్ బుక్‌లో రాసుకుని, రోజూ దానిని చూస్తూ, అందుకు తగిన ప్రణాళిక ప్రకారం సాధన చేయాలని సలహా ఇచ్చారు. పదో తరగతిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. అమ్మాయిలకు ఆర్థిక స్వాతంత్రం కావా లన్నారు. వచ్చే సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన వారికి తన తరపున ప్రత్యేక బహుమతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. వచ్చే సంవ త్సరం టాపర్ ను తప్పని సరిగా తన వద్దకు తీసుకు రావాలని హెచ్ఎంకు సూచించారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రయోగ శాల, గ్రంథాల యాన్ని కలెక్టర్ పరిశీలించారు.

### చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్

జాజాపూర్ అంగన్ వాడిలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని స్థానిక ప్రభు త్వ ప్రాథమిక పాఠశాలలలో చేరిన (అంగన్‌వాడీ) చిన్నారులకు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అక్షరా భ్యాసం చేయించారు. అంతకు ముందు సరస్వతీ మాత చిత్రపటానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజు, మండల విద్యా శాఖ అధి కారి బాలాజీ, ఆయా పాఠశా లల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో సహజ విపత్తుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్ ప్రతినిధి, జూన్ 16 (జనం సాక్షి):** రానున్న వర్షాకాలంలో సంభవించే సహజ విపత్తులు, వరదల నివారణకు సంబంధించి అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తం గా ఉండాలి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గృహాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావును సూచించారు. గ్రామాలలో నాలుగు రకాల చెత్తలను సేకరించుటలో ఏదో ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసి గ్రామాలలో నాలుగు రకాల చెత్త ద్వారా చెత్త సేకరణ చేపట్టాలని అన్నారు. ఎలక్ట్రికల్ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాల వలన ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎలక్ట్రిసిని ఎస్సీ ఆనందం కు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరుగును. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ వై వి గణేష్ , డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



**చిట్యాల, జూన్ 16( జనం సాక్షి):** తెలంగాణ మెడికల్ ఒహెల్త్ ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి, ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి సూపర్డెంట్ కి మెమోరాండం అందించారు. ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ శానిటేషన్ సెక్యూరిటీ పేషంట్ కేర్ మూడు నెలల నుంచి కష్టాలు కన్నీళ్ళతో డ్యూటీలు చేసుకుంటా ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డపేరు రాకుండా అహర్నిశలు కష్టపడుతున్నాం ఈ కష్టానికి ప్రతిఫలంగా ప్రభుత్వం వెంటనే స్పందించి గత పెండింగ్ వేతనాలు, మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్కూరి నరేందర్, జాయింట్ సెక్రెటరీ అంకం కిషోర్, రాజేష్, కోమల, రమణ, శ్రీకాంత్, శశి, రాధ, శారదా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## గణపురం ఫర్టిలైజర్ షాపుల్లో సీసీఎస్ పోలీసుల సోదాలు

- రైతులను మోసం చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతులను నకిలీ విత్తనాల పేరుతో మోసం చేసే వ్యాపారులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాలతో గణపురం మండలం ఫర్టిలైజర్ షాపుల్లో మంగళవారం సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో సోదాలు నిర్వహించాయి. స్టాక్ రిజిస్టర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. విత్తనాల నిల్వలు, గడువు తేదీలు చెక్ చేశారు. తనిఖీల్లో గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లు అమ్మకానికి ఉంచినట్లు గుర్తించారు. విడి విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు పసిగట్టారు. కొన్ని షాపుల్లో బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు చేస్తున్నట్లు తేలడంతో షాపు యజమానులను పోలీసులు హెచ్చరించారు. గడువు ముగిసిన విత్తనాలు, నకిలీ విత్తనాలు, విడి విత్తనాల విక్రయాలు పూర్తిగా నిషేధం అని తెలియజేశారు. ప్రతి అమ్మకానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. రైతులను మోసం చేసే ఉద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ రమేష్ హెచ్చరించారు. కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు రైతులకు సూచనలు ఇచ్చారు. విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని చెప్పారు. అనుమానాస్పద విత్తనాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నకిలీ విత్తనాల విక్రయాలు పెరిగే అవకాశం ఉంది. అందుకే ముందస్తుగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. నకిలీ విత్తనాల వల్ల ఎకరానికి పంట దిగుబడి సగానికి పడిపోతుంది. రైతు నష్టపోతాడు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయడానికే సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు.

## కెరమెరి మండలంలో పోడు భూముల రగడ



- 100 ఎకరాల భూమి అంశంపై ఉద్రిక్తత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16 (జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో మళ్లి పోడు వివాదం రగిలింది. మంగళవారం కెరమెరి మండలంలోని సుర్దాపూర్ గ్రామ శివారులోని సుమారు 100 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులు వారి వాహనాలను రైతులు అడ్డుకున్నారు. దీంతో ఫారెస్ట్ అధికారులు పోడు రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఘటన స్థలానికి భారీగా పోలీసులు రావడంతో కాసేపు ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. గత 40 ఏళ్ల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ తాము జీవనం సాగిస్తున్నామని, ఎలాంటి ముందుస్తు నోటిసులు సమాచారం ఇవ్వకుండా ఇప్పుడు ఖరీఫ్ సీజన్ సాగు సమయం లో వచ్చి విత్తనాలు వేయకుండా తమకు ఈ విధంగా ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులకు గురి చేయడం పట్ల ఫారెస్ట్ అధికారులపై రైతులు మండిపడ్డారు. ఇన్నేళ్ల నుంచి సాగు చేస్తున్న మా భూములను ఇప్పుడు లాక్కుంటే ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు, పోలీసులు తమను అరెస్టు చేసి కేసు పెట్టిన, చంపిన మా సాగు భూములను వదులు కోము అని, వెనక్కి తగ్గేది లేదని పోడు రైతులు వాపోతున్నారు. ఫారెస్ట్ అధికారులు మాత్రం సుమారు 100 ఎకరాల అటవీ భూముల రైతులు అక్రమంగా సాగు చేస్తున్నారని తెలిపారు. వారి వద్ద కనీసం అటవీ హక్కు పత్రాలు కూడా లేవని తెలిపారు. ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన తమను రైతులు అడ్డుకుని, తమ వాహనాలపై రాళ్ళతో దాడికి యత్నించారని ఫారెస్ట్ అధికారులు ఆరోపించారు.

# ప్రైవేటు స్కూళ్లా..? దోపిడీ దుకాణాలా..?

- భూపాలపల్లిలో ప్రైవేట్ స్కూళ్ల దందా
- డబ్బు కోసం అడ్డదారులు తొక్కుతున్న యాజమాన్యాలు
- తల్లిదండ్రుల జేబులకు చిల్లులు
- విద్యాశాఖ నిబంధనలు బుట్టదాఖలవుతున్న వైనం





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పిల్లలకు చదువు చెప్పాల్సిన చోట వ్యాపారం చేస్తున్నారు. ప్రైవేట్ స్కూళు ఇప్పుడు కార్పొరేట్ దుకాణాలుగా మారాయి. ఫీజులతో ఆగకుండా బుక్స్, స్టేషనరీ, యూనిఫామ్స్, టై, బెల్ట్, షూస్, బ్యాగుల పేరుతో తల్లిదండ్రులను నిలువునా దోచేస్తున్నాయి. ప్రభుత్వం ఎన్నిసార్లు చెప్పినా ఈ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. స్కూల్ ఆవరణలో బుక్స్, యూనిఫాం అమ్మకూడదని ఆర్టీఈ చట్టం స్పష్టంగా చెబుతోంది. పేరెంట్స్‌కు ఇష్టమైన చోట కొనే హక్కు ఉంది. కానీ భూపాలపల్లి జిల్లాలోని చాలా ప్రైవేట్ స్కూళ్లు ఈ నిబంధనను కాగితాలకే పరిమితం చేశాయి. మార్కెట్లో తక్కువ ధరకు దొరికే బుక్స్ స్కూల్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. రూపాయలు. యూనిఫాం పేరు స్కూల్ క్యాంపస్‌లో అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. టై బెల్ట్ సెట్‌కు వసూలు చేస్తున్నారు. బిల్లు అడిగితే ఇవ్వరు. క్వాలిటీ ప్రశ్నిస్తే పిల్లల మీద వేధింపులు మొదలు పెడతారు. ఫీజు లేట్ అయితే పిల్లల్ని గేటు బయట నిలబెడతారు. బుక్స్ బయట కొన్నామని తెలిస్తే టెస్టుల్లో మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తారు. క్లాస్ టీచర్ల ద్వారా పేరెంట్స్ మీద ఒత్తిడి తెస్తారు. ఇది విద్యా వ్యాపారమా? లేక వ్యవస్థీకృత దోపిడీనా? ఒక ఎల్‌కేజీ పిల్లాడి కోసం జూన్ నెలలోనే వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అడ్మిషన్ ఫీజు, బుక్స్, యూనిఫాం, ఇతర ఖర్చులు సహా వేలాది రూపాయలు వసూలు చేస్తూ ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు దోపిడికి పాల్పడుతున్నాయి. మధ్యతరగతి తల్లిదండ్రులు అప్పులు చేసి ఈ దోపిడీని భరిస్తున్నారు. బ్యాంకు లోన్లు తీసుకుని పిల్లల్ని స్కూల్‌కు పంపుతున్నారు. కమీషన్ మాఫియా ఇక్కడే ఆగడం లేదు. బుక్కుల మీద, యూనిఫాం మీద కమీషన్లు తీసుకుంటున్నారు. స్కూల్ యాజమాన్యం, డీలర్ కలిసి తల్లిదండ్రులను దోచుకుంటున్నారు. అధికారులు సంవత్సరానికి ఒకసారి కాగితాల తనిఖీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో దోపిడీ యథాతథంగా సాగుతోంది. ఫిర్యాదు చేసినా చర్యలు ఉండవు. ఎందుకంటే స్కూల్ యాజమాన్యాలు తమ ఆర్థిక బలాన్ని ఉపయోగిస్తాయి. ఈ దోపిడీ వల్ల చదువు అందరికీ దూరమవుతోంది. పేద తల్లిదండ్రులు పిల్లల్ని ప్రైవేట్ స్కూల్ నుంచి తీసేసి ప్రభుత్వ స్కూల్‌కు పంపుతున్నారు. కానీ అక్కడ ఇంగ్లీష్ మీడియం లేదు అనే కారణంతో మళ్లీ ప్రైవేట్ వైపు వెళ్తున్నారు. దీంతో దోపిడీ చక్రం తిరుగుతూనే ఉంది. తల్లిదండ్రులు ఇప్పుడు నిలదీయడం మొదలు పెట్టారు. గ్రూపులుగా ఏర్పడి యాజమాన్యాలను ప్రశ్నిస్తున్నారు. కానీ ఒంటరి పోరాటం సరిపోదు. వ్యవస్థ మొత్తం మేల్కోవాలి.

**సన్ వాలీ స్కూల్ దోపిడీ బట్టబయలు చేసిన ఎస్ఎఫ్ఐ..**

జిల్లా కేంద్రంలోని సన్ వాలి స్కూల్ నడుపుతున్న యాజమాన్యం దోపిడీని ఎస్ఎఫ్ఐ మంగళవారం బహిర్గతం చేసింది. విద్యను వ్యాపారంగా మార్చి విచ్చలవిడిగా బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. మంగళవారం ఉదయం ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు స్కూల్ ముందు ధర్నా చేపట్టారు. తల్లిదండ్రులను వెంటబెట్టుకొని స్కూల్ లోపలికి వెళ్లారు. అక్కడ దాచిపెట్టిన బుక్స్ స్టాక్, యూనిఫాం బండిల్స్ బయటపెట్టారు. తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈఓకు ఫోన్ ద్వారా విషయం తెలియజేశారు. ఎంఈఓ సంఘటన స్థలానికి చేరుకుని స్టాక్ అంతా సీజ్ చేశారు. అక్రమ అమ్మకాలపై విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ్డు స్మరణ, కుమ్మరి రాజ్ కుమార్ లు మాట్లాడుతూ ఇది విద్యా దోపిడీ, పిల్లల భవిష్యత్తును అడ్డుపెట్టి వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి స్కూల్‌లో ఇదే దందా నడుస్తుందని, అన్నింటిపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ ఆగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఎస్ఎఫ్ఐ పోరాటానికి మద్దతు తెలిపి, మా పిల్లల చదువు కోసం అప్పులు చేస్తున్నాం. ఇంకా ఎంత దోచుకుంటారు? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఇప్పటికైనా కళ్లు తెరిచి అన్ని ప్రైవేట్ స్కూళ్లపై విస్తృత తనిఖీలు చేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రజా ఆగ్రహం ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- మెగా జాబ్ మేళా విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం
- జూన్ 17న జరిగే మెగా జాబ్ మేళా నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జూన్ 16(జనంసాక్షి) :** ములుగు జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 17వ తేదీ బుధవారం ఇంచర్లలోని ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ తో కలిసి ఇంచర్ల లోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో జాబ్ మేళాకు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో తాగునీరు, భోజనం, కూర్చునే వసతి, పార్కింగ్, షేడ్ తదితర ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనే ఈ మెగా జాబ్ మేళాలో విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నందున కంపెనీల వారీగా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, అభ్యర్థులు సులభంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయభాస్కర్, సీఐ దయాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.4.29 కోట్ల టోకరా..

- రైస్ మిల్లు యజమాని అరెస్ట్

**కాటారం, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వానికి అప్పగించాల్సిన సుమారు రూ. 4.29 కోట్ల విలువైన బియ్యాన్ని అందించకుండా అక్రమాలకు పాల్పడిన కేసులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన 3 ఆర్ఎస్ రుద్ర రైస్ మిల్లు యజమాని చీర్ల రవికాంత్‌ను కాటారం పోలీసులు అరెస్ట్ చేశారు. 2022-23 రబీ, ఖరీఫ్ సీజన్లలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మిల్లుకు సుమారు 38 వేల క్వింటాళ్ల వడ్లను బియ్యం పట్టేందుకు అప్పగించగా, మిల్లు యాజమాన్యం ప్రభుత్వానికి బియ్యాన్ని తిరిగి అందించలేదు. దీంతో డిప్యూటీ మేనేజర్ సీతగారి రాఘవేందర్ ఫిర్యాదు మేరకు 2024లో కేసు నమోదైంది. కాటారం సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు జూన్ 15న చింతకాని క్రాస్ వద్ద రవికాంత్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో ఎవరెవరి ప్రమేయం ఉన్నా వదిలిపెట్టబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఈవూరి నాగార్జున రావు హెచ్చరించారు.

### స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

**ఖానాపూర్ జూన్ 16 (జనం సాక్షి) :** ప్రైవేట్ పాఠశాలల్లో బస్సులు నడిపే యజమాన్యాలు వాటికి ఫిట్నెస్లు తప్పనిసరిగా చేయించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆసిఫ్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలో బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యాజమాన్యాలు విధిగా తమ తమ పాఠశాలకు సంబంధించిన బస్సులకు రోడ్డు నిబంధనలను అనుసరించి ద్రోపత్రాలు ఉంచుకోవాలని సూచించారు. సకాలంలో ద్రుపత్రాలు ఉంచుకొని రోడ్డు నిబంధనలను పాటించాలని అన్నారు.

## గ్రామంలో ప్రభుత్వ బడికే పంపాలని ఏకగ్రీవ తీర్మానం



**ములుగు/వెంకటాపూర్, జూన్16 (జనం సాక్షి):** నల్లగుంట గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బడులను పరిరక్షించుట కొరకు బడికి వెళ్లే పిల్లలకు తల్లిదండ్రులను ప్రైవేటు బడి కి పంపకుండా గ్రామం లోని ప్రభుత్వ బడి కి పంపే విధంగా గ్రామ సభ లో గ్రామ పెద్దల సమక్షం లో, పాలకవర్గం సమక్షం లో ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ నాయక్ మరియు ఉప సర్పంచ్ మోరే లింగస్వామి లు మాట్లాడుతూ గ్రామం లోకి ప్రైవేటు వాహనాలను రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అలాగే మన గ్రామ ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన గ్రామ ప్రజలందరిని చెప్పారు. గ్రామం లోని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ ప్రజలు మరియు గ్రామ పాలకవర్గం విద్యార్థుల తల్లిదండ్రులు ఏకమై ప్రభుత్వ బడి కే వెళ్లాలని ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య శ్రీదేవి శంకర్ నాయక్, ఉపసర్పంచ్ మోరె లింగస్వామి, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు మెంబర్లు పొనగంటి రవి, తంగళ్ళపల్లి శ్రీధర్, పిన్ రెడ్డి రమణ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు రామగిరి శ్రీనివాస్, గ్రామ పెద్దలు మందల ప్రభాకర్ రెడ్డి, పోలుదాసరి రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పంట పొలాలను కబ్జా చేసిన గిరిజనులు

- ఉద్యమించిన ఏటూరునాగారం గిరిజనేతరులు
- ఆపడానికి ప్రయత్నించిన ఏఎస్పీ
- రెండు గంటల పాటు తీవ్ర ఉద్రిక్తత
- 144, 145 సెక్షన్లను అమలు చేసిన తహసిల్దార్






**ఏటూరునాగారం, జూన్ 16(జనంసాక్షి) :** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఆకుల వారి ఘనపూర్ ప్రాంతంలో గల 209 సర్వే నెంబర్ లో గల 120 ఎకరాల భూమిని స్థానికేతర గిరిజనులు ఆక్రమించుకోవడంతో భూ వివాదం రచ్చకెక్కింది. స్థానిక గిరిజనేతరులు ఒక్కసారిగా ఉద్యమించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. సుమారు రెండు గంటల పాటు పోలీసులు స్థానికుల మధ్య తోపులాట జరిగి చివరికి 144 సెక్షన్ అమలుకు దారి తీసింది. పంట పొలాలను అసరాగా చేసుకుని పూర్వం నుండి స్థానిక గిరిజనేతర రైతులు జీవిస్తున్నారు. రెండు రోజుల క్రితం వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన గిరిజన కుటుంబాలు ఏటూరునాగారం లోని అవినీతికి పాల్పడుతున్న కొంతమంది గిరిజనులతో చేతులు కలిపి ఈ 120 ఎకరాలను రాత్రికి రాత్రి ఆక్రమించుకుని రాత్రి పగలు అక్కడే ఉంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక రైతులు సంఘటన స్థలానికి వెళ్లి ఈ పోలాలు మావని పూర్వం నుండి సాగు చేసుకుని జీవిస్తున్నామని కాళ్ల వెళ్ళపడి మొరపెట్టుకున్న గిరిజనులు వినలేదు దాంతో దిక్కుతోచని రైతులు పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి వెళ్లి ఎలాంటి ఆధారాలతో స్థలాలు ఆక్రమించుకున్నారని ప్రశ్నించారు. మాకు ఆధారాలు లేవని చట్టాలు ఉన్నాయని మాకు ఎక్కడైనా స్థలం ఆక్రమించుకోవడం ఇల్లు నిర్మించుకునే హక్కులు ఉన్నాయని గిరిజన మహిళలు ఎస్సై తో వాదించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై మహేష్ వారిని హెచ్చరించారు. అయిన వినని గిరిజనులు పొలాలను ఎవరికివారు హద్దులు ఏర్పాటు చేసుకొని గుడిసెలు వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతులు వ్యాపారస్తులు మహిళలు పార్టీలకు అతీతంగా ప్రజాప్రతితులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. శాంతియుత ర్యాలీతో ఐటీడీఏ వరకు వెళ్లడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఏఎస్పీ మనన్ బట్ ఐదు మండలాల ఎస్సై సీఐలకు సమాచారం ఇచ్చి అదనపు పోలీసు బలగాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. అయినా ఉద్యమం ఆగలేదు వైజంక్షన్ వద్ద గిరిజనేతరులు పోలీసుల మధ్య తోపులాట జరిగింది తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది లా అండ్ ఆర్డర్ చెయీ దాటిపోయే ప్రమాదం ఉందని గమనించిన ఏఎస్పీ చట్టాన్ని మీ చేతిలోకి తీసుకోవద్దని వారికి నచ్చ చెప్పారు. గిరిజనులను పొలాల నుండి కాళీ చేపించాలని లేనట్లయితే మేము దేనికైనా తెగిస్తామని కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఏఎస్పీ ఆదేశంతో ఎస్ఐ మహేష్ తాసిల్దార్ కు సెక్షన్ లను అమలు చేయాల్సిందిగా కోరారు. దాంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మార్వో జగదీష్ 144,145, 163,164 సెక్షన్ లను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూముల్లో నుండి గిరిజనులను వెళ్ళగొట్టిస్తామని మీ పొలాలను మీకు అప్పజెప్తామని తాసిల్దార్ స్థానికులకు హామీ ఇచ్చారు. గిరిజనులను పొలాలలో నుండి వెళ్లగొట్టడానికి పోలీస్, రెవెన్యూ యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తుంది. ఈ ఉద్యమంలో స్థానిక ప్రజలు, జేఏసీ నాయకులు వ్యాపారస్తులు, రైతులు, మహిళలు, పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్



**మిర్యాలగూడ, జూన్ 16 (జనంసాక్షి)** : మోటార్ సైకిళ్ల (బైక్‌ల) దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ వన్ టౌన్, టూ టౌన్ ఇన్స్పెక్టర్‌లు ఎం. నాగభూషణరావు, జె. సోమనర్సయ్యలు విలేఖరులకు తెలిపారు. మంగళవారం నాడు స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో వారు వెల్లడించిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం ఆర్జాలబావికి చెందిన కొంగరి నవీన్ కుమార్, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం గుడుగుంట్లపాలెంకు చెందిన సోమిరెడ్డి సైదిరెడ్డి, దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన కంచరకుంట్ల సుమలతలను అరెస్టు చేసినట్టు తెలిపారు. మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఉన్న వారిని పోలిసులు ప్రశ్నించగా తాము 9 బైకులు దొంగతనం చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. వారి నుండి రెండు మోటార్ సైకిల్లు( బైకులు )అమ్మితే వచ్చిన రూ. 1.38 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగతనం చేసిన బైకులను తక్కువధరకు కొనుగోలు చేసి విడిబాగాలు చేసి అమ్మినందుకు అరెస్టు చేశామని తెలిపారు. ఆమె నుండి రూ.1.38లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ సోమనర్సయ్య, ఎఎస్‌ఐ షేక్ గఫ్ఫార్, హెడ్ కాన్స్టేబుల్ ఆర్. స్వర్ణకుమార్, పీసీ పి. బాలకృష్ణ,జి. కళ్యాణ్, సూరా, బి. మణిదీప్, సయ్యద్ సమద్, ఎండి. అక్బర్ పాషా, ఎం. రామకృష్ణ, ఎస్. రాజశేఖర్, ఎం. లక్ష్మయ్యలు దొంగలను పట్టుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అభినందించారు.

## జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రతపై తనిఖీలు చేపట్టాలి

● **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 16 (జనంసాక్షి)** : జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఆహార భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్రతి 15 రోజులకు ఒకసారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు.వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందేలా పాలు, పాల ఉత్పత్తుల విక్రయదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిత్యవసర పాలు, నూనెలు, మాంసం, గుడ్లు, స్వీట్లు, సిద్ధం చేసిన ఆహార పదార్థాలపై నిఘా పెంచి, నమూనాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు, దాబాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఆహార నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.గతంలో కేసులు నమోదైన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీల్లో శిక్షణ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వారికి, చిన్న పిల్లలకు ఆహారం అందించే అంగన్వాడీ కార్యకర్తలకు దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.విద్యార్థులకు సైతం ఆహార భద్రతపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు.పాఠశాలల్లో ఆహార వస్తువుల నిల్వ, భద్రతకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.సమాజానికి హానికరమైన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ, రవాణా, అమ్మకాలపై ఆహార భద్రత, పోలీస్, మరియు ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం జిల్లాలోని చిన్న, పెద్ద ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని అన్నారు.వినియోగదారుల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కల్తీ ఆహారంపై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్య పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కల్తీ ఆహారం లేదా నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే గూగుల్ ప్లే స్టోర్ లోని ఫుడ్ సేఫ్టీ కనెక్ట్ యాప్ ద్వారా గానీ, లేదా జిల్లా ఆహార భద్రతా



కార్యాలయం 9133291926, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం 08684-222666, రాష్ట్ర ఆహార భద్రతా హెల్ప్‌లైన్ 9100105795, 040-21111111 హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, ఫుడ్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిటిడిఓ శంకర్, ఎస్సి డిడి దయానందరాణి,డిఐఓ కోటి రత్నం, డిడబ్ల్యూఓ, నరసింహారావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి

● **కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 16 (జనం సాక్షి)** : దేశవ్యాప్తంగా అమలు అవుతున్న ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుండి యాదాద్రి భువనగిరి జిల్లాను మోడల్ డిస్ట్రిక్ట్ గా, ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు ఈరోజు ఉదయం 11 గంటలకు భువనగిరి పట్టణంలోని పెద్దిస్ ఐ హాస్పిటల్ మరియు ఈఎస్టీ హాస్పిటల్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న హెల్త్ కేర్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్ మరియు హెల్త్ కేర్ ప్రొఫెషనల్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నమోదు విధానం, సాంకేతిక అంశాలు మరియు అమలు



పురోగతిపై దిశా నిర్దేశం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక మిషన్ ద్వారా ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, మెడికల్ షాప్‌లు ద్వారా మరియు ఆరోగ్య సేవలందించే సిబ్బంది అందరు కూడా చేసుకోవడం ద్వారా ఒక సురక్షితమైన డిజిటల్ వేదికపై అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. పౌరులు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఐడీని సృష్టించుకోవడం ద్వారా తమ వైద్య చరిత్ర, డాక్టర్ ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ నివేదికలు మరియు ఇతర ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో భద్రపరచుకొని అవసరమైనప్పుడు దేశంలోని ఏ వైద్య సంస్థతోనైనా సురక్షితంగా పంచుకోవచ్చునని అన్నారు దీంతో వైద్య సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి రావడంతో పాటు టెలిమెడిసిన్, డిజిటల్ కన్సల్టేషన్లు మరియు ఆరోగ్య సేవల సమన్వయం మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. ఎం. మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ఐఎంఏ ప్రతినిధులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ - అటవీ భూముల సరిహద్దు వివాదాలను సత్వరమే పరిష్కరించాలి

● **నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**తిరుమలగిరి (సాగర్), జూన్ 16 (జనంసాక్షి)** : మండలంలోని జమ్మనకోట, సుంకిశాల తండా గ్రామాల రైతుల భూములపై అటవీశాఖ, రెవెన్యూ శాఖ ల మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాలు సత్వరమే పరిష్కరించాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు . మంగళవారం ఆయన తహసిల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ జి శ్రీనివాస్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని భూ సమస్యలపై అధికారులతో చర్చించి వారికి తగు సూచనలు చేశారు. రిహాబిటేషన్ గ్రామాలైన జమ్మనకోట, నాగార్జున పేట, సుంకిశాల తండా గ్రామాల రైతులు ప్రస్తుతం సాగు చేసుకుంటున్న భూములలో అటవీ శాఖతో సరిహద్దు వివాదాలు ఉన్నాయని ,వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు .సందర్భంగా కార్యాలయంలోని ఫైళ్లను పరిశీలించి, ఫారెస్ట్ భూములు మరియు రెవిన్యూ భూములకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. భూముల యాజమాన్యాలకు, సరిహద్దులకి, గెజిట్ నోటిఫికేషన్లకు సంబంధిత పత్రాలకు సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలపై అధికారులు నివేదిక అందించారు. ఫారెస్ట్ - రెవిన్యూ శాఖల మధ్య ఏర్పడిన భూ వివాదాలు లేదా ఇతర సమస్యలు ఉంటే వాటిని ఆలస్యం చేసకుండా తక్షణమే పరిష్కరించమని సూచించారు. భూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించిన కలెక్టర్, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి ,జిల్లా ఫారెస్ట్ అధికారి రాజశేఖర్, తహసిల్దార్ అనిల్ కుమార్, గిర్దావర్ లక్ష్మీకాంత్ ,రెవిన్యూ సిబ్బంది తదితరులున్నారు.

## దామరగిద్ద పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి)** : నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతినీ దామ రగిద్ద ఎస్ఐ నరేష్ ను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుతు న్న సేవలపై ఆరా తీశారు. బాధితులకు ప్రజలకు వేగ వంతమైన పోలీస్ సేవలు అందించాలని ఏవైనా సంఘ టనలపై సమాచారం అందు కున్న వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించా రు. అర్ధరాత్రి వేళ గ్రామాలలో రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. వివిధ సమస్యల పై ఫిర్యాదులు చేయడానికి వచ్చిన బాధితులతో సమర స్యంగా మాట్లాడి వారి సమ స్యలు అడిగి తెలుసుకొని సమస్యలపై సిబ్బంది వేగంగా స్పందించాలని ఆదేశించా రు.పోలీసు సిబంది క్రమ శిక్షణ సమయ పాలన పాటించాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందిం చాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక లాపాలు, అక్రమ రవాణాను కఠినంగా నిరోధించాలని ఆదేశించారు. ప్రధాన రహదా రిపై భద్రతను మరింత కట్టు దిట్టం చేయాలని సూచించా రు. రోడ్డు ప్రమాదాల నివార ణ, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై ప్రజల్లో నిరంత రం అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. రాత్రి సమయం లో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరిస్థి తులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ కల్పించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రభుత్వ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు చేరువలో ఉంటూ మెరుగైన పోలీసింగ్ అందించాలని తెలిపారు.

## ఎయిమ్స్‌తో రోగులకు మరింత మెరుగైన వసతులు



**బీబీనగర్, జూన్ 16 (జనంసాక్షి)** : బీబీనగర్ మండల కేంద్రంలో గల ఎయిమ్స్ వైద్య కళాశాలలో మౌలిక వసతుల కల్పన, నూతన ప్రాజెక్టుల పురోగతిపై మంగళవారం నిర్వహించిన స్టాండింగ్ ఎస్టేట్ కమిటీ అత్యున్నత స్థాయి సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎయిమ్స్ బీబీనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమితా అగర్వాల్ పాల్గొన్నారు. ఎయిమ్స్ అభివృద్ధి, రోగులకు మరింత మెరుగైన వసతులు కల్పించే దిశగా ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఎయిమ్స్ తొలి స్టాండింగ్ ఎస్టేట్ కమిటీ సమావేశంలో పాల్గొని, తెలంగాణలో వైద్య సేవలు మరియు వైద్య విద్యను మరింత బలోపేతం చేసే దిశగా ఎయిమ్స్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఎన్‌సిసి, హెచ్‌ఐటీఈఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫేజ్-1 నిర్మాణ పనుల పురోగతి, వాటి పూర్తి గడువులు, హెచ్ఎమ్‌డిఏ కనెక్టివిటీ, టీఎస్ఆర్టీసీ ప్రజా రవాణా సౌకర్యాలు, ఫైర్ సర్వీసెస్ నుంచి అవసరమైన అనుమతులు వంటి అంశాలపై సమీక్షలో ప్రస్తావించారు. గుర్తింపు పొందిన జర్నలిస్టులు, వారి కుటుంబాలకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, రోగులు మరియు అత్యవసర సేవలకు ప్రయాణ సమయాన్ని తగ్గించేలా కోడమడుగు గ్రామం వైపు నుంచి యాక్సెస్ రోడ్ ఏర్పాటు చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.అదేవిధంగా విశ్రామ్ సదన్ నిర్మాణం, రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు, ఇప్పటికే ఉన్న మౌలిక వసతుల సమర్థ వినియోగం, డెంటిస్ట్రీ విభాగం బలోపేతం వంటి ప్రతిపాదనలు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా పలు అంశాలు చర్చించారు.ఏఐఐఎమ్ఎస్ ఏఐఐఎమ్ఎస్ బీబీనగర్ తెలంగాణ ప్రజలకు మరింత చేరువ కావాలని, అన్ని ప్రాజెక్టులు నిర్ణీత గడువుల్లో పూర్తై అత్యుత్తమ వైద్య సేవలు, వైద్య విద్య మరియు పరిశోధనకు కేంద్రంగా ఎదగాలని సమావేశంలో స్పష్టం చేయడం జరిగింది. ఈ సమావేశంలో స్టాండింగ్ ఎస్టేట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ డా. శైలేంద్ర హండు (ఏఐఐఎమ్ఎస్ రిషికేశ్), ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి , ఏఐఐఎమ్ఎస్ కళ్యాణికి చెందిన ప్రొఫెసర్ డా. తీర్థంకర్ దేబ్ గారు, ఏఐఐఎమ్ఎస్ బీబీనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమితా అగర్వాల్, మెడికల్ సూపరింటెండెంట్ డా. మహేశ్వర్ లక్కిరెడ్డి , డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) శ్రీ రాజనీష్ మిశ్రా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ వి. శశికుమార్ పాల్గొన్నారు.

## పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 16 (జనం సాక్షి)** : పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకుండా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాలలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ ప్రక్రియను సమీక్షించి, ప్రతి విద్యార్థికి అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూలి, బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారిని గుర్తించి పాఠశాలల్లో నమోదు చేయాలని తెలిపారు. ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య సేవల అమలుపై ఆరా తీశారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, పిల్లలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సింగరేణి మండల తహసీల్దారు వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, విద్యా శాఖ సిబ్బంది ఉన్నారు.

## అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

● **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 16 (జనంసాక్షి)** : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు, నకిలీ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా దాదాపు 24 సంవత్సరాల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో బిఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నెల రోజుల పాటు నిర్వహించే ఓటరు ప్రత్యేక సవరణ డ్రైవ్‌కు సంబంధించిన విధి విధానాలను వివరించారు.జూన్ 25 నుండి నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై, జూలై 24 వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి హౌస్ టు హౌస్ సర్వే నిర్వహిస్తారని, ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన ఫారాలను అందిస్తారని వివరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని క్షేత్రస్థాయిలోనే బిఎల్‌ఓ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు.ఈ సర్వేలో ప్రధానంగా 2022 నాటికి ఓటరుగా నమోదై, ప్రస్తుతం ఉన్న వారి వివరాలను



ధృవీకరిస్తారని, ఒకవేళ 2022 నాటికి ఓటరు జాబితాలో పేరు లేకపోతే, వారిని తల్లి లేదా తండ్రి వివరాలతో మ్యాపింగ్ చేస్తారని స్పష్టం చేశారు.ఓటరు పేరు, తండ్రి పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదై ఉంటే ఈ సవరణల ప్రకారం వాటిని సరిచేస్తారన్నారు.చనిపోయిన వారి పేర్లను, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుండి తొలగిస్తారని తెలిపారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తారని, నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా సరైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సరైన సమాధానం లేదా ఆధారాలు ఇవ్వకపోతే ఓటును తొలగిస్తారని చెప్పారు. తుది డ్రాఫ్ట్ జాబితాలో పేరు నమోదైన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామని, ఇందులో ఏవైనా లోపాలు కనిపిస్తే సంబంధిత ఆర్డీఓలు నోటీసులు జారీ చేస్తారని తెలిపారు.అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి లేదా ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చిన వారు తమ అడ్రస్ మార్చుకోవడానికి ఫామ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల గుర్తింపు కార్డులను ఆధారాలుగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకటించే నాటికి ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావాలని ఆదేశించారు.ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితా తయారీకి బిఎల్‌ఓలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ వి.రమేష్ తహసీల్దార్లు, ఏఎల్ఎంటిలు, సూపర్వైజర్లు, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

● **విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**



**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 16 (జనం సాక్షి)** : భువనగిరి పట్టణ పరిధిలోని హుస్సేనాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన అడ్మిషన్ల వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని కొత్త అడ్మిషన్లు వచ్చాయని, విద్యార్థినుల హాజరు శాతం ఎలా ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. మరమ్మతుల పనులు నెమ్మదిగా సాగుతున్న విషయంపై ఆరా తీసిన ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాల స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, పప్పు కూరగాయలునాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వంట నూనె ప్యాకెట్లపై ఉన్న గడువు తేదీలను పరిశీలించి, కాలపరిమితి ముగిసిన వస్తువులు వినియోగించరాదని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పరిశు భ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాధికారి బిక్షపతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# మూడో రోజూ సూచీలు రయ్..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో మన మార్కెట్లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. ముడి చమురు ధరలు దిగి రావడం; ద్రవ్యోల్బణం, వృద్ధి భయాలు తగ్గుముఖం పట్టడమూ మార్కెట్‌కు కలిసొచ్చింది. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్ రాణించగా.. మెటల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ 24 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. సెన్సెక్స్ ఉదయం 76,526.77 (క్రితం ముగింపు 76,264.33) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,846.74 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 544.15 పాయింట్ల లాభంతో 76,808.48 వద్ద ముగిసింది. నిఫ్టీ 135.25 పాయింట్ల లాభంతో 23,989.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.55గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్ షేర్లు రాణించాయి. ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, బీఈఎల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 81 డాలర్లకు దిగి రాగా.. బంగారం ఔన్సు 4343 డాలర్ల వద్ద కొనసాగుతోంది.


**2 రోజుల్లో రూ.18.15 లక్షల కోట్ల లాభం**

**పశ్చిమాసియా శాంతి ఒప్పందంతో మార్కెట్లకు ఉత్సాహం**

ముడి చమురు ధరలు తగ్గడమూ కలిసొచ్చింది అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ విరమణ ప్రకటనకు అనుగుణంగా హర్మూజ్ జలసంధిలో నౌకారవాణా ప్రారంభం కావడం.. ముడిచమురు ధరలు తగ్గడంతో సోమవారం ప్రపంచ మార్కెట్లు సానుకూలంగా స్పందించాయి. ఈ నెల 19న స్విట్జర్లాండ్‌లో శాంతి ఒప్పందం జరగబోతోందని అధికారులు వెల్లడించడంతో.. మదుపర్లు ఉత్సాహంగా కొనుగోళ్ళు జరిపారు. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 5% తగ్గి 82.90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇది 3 నెలల కనిష్ఠస్థాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 60 పైసలు లాభపడి, 5 వారాల గరిష్ఠమైన 94.58 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు లాభపడ్డాయి. ఐరోపా మార్కెట్లు కూడా సానుకూలంగా కదలాడాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ సోమవారం రూ.8.49 లక్షల కోట్లు పెరిగి, రూ.470.49 లక్షల కోట్ల (4.97 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. గత 2 ట్రేడింగ్ రోజుల్లో సంపద విలువ రూ.18.15 లక్షల కోట్లు పెరిగింది. సెన్సెక్స్ ఉదయం 76,725.27 పాయింట్ల వద్ద సానుకూలంగా (క్రితం ముగింపు 75,527.95 పాయింట్లు) ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,821.07 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 76,140.44 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. చివరకు 736.38 పాయింట్ల లాభంతో 76,264.33 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 231 పాయింట్లు పెరిగి 23,853.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,011.40–23,817.80 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. ట్రెంట్ 5.35%, ఇండిగో 3.59%, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.58%, అల్ట్రాటెక్ సిమెంట్ 3.29%, ఎటర్నల్ 3.26%, మారుతీ సుజుకీ 3.25%, ఎం అండ్ ఎం 3.01%, ఎల్ అండ్ టీ 2.99%, బజాజ్ ఫైనాన్స్ 2.69%, టైటన్ 2.27%, ఇన్ఫోసిస్ 1.68%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.11%, భారతీ ఎయిర్‌టెల్ 1% పెరిగాయి. ఎన్టీపీసీ 1.64%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.94%, హెచ్‌యూఎల్ 0.54% చొప్పున తగ్గాయి. రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి 3.93%, వాహన 2.69%, మన్నికైన వినిమయ వస్తువులు 2.02%, పారిశ్రామిక 1.73%, సేవలు 1.66% పెరిగాయి. హాస్పిటల్స్, ఆరోగ్య సంరక్షణ, లోహ రంగాలు డీలా పడ్డాయి. ముడి చమురు ధర తగ్గడంతో చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ), విమానయాన, రంగుల కంపెనీల షేర్లు లాభపడ్డాయి. హెచ్‌పీసీఎల్ 3.36%, బీపీసీఎల్ 2.71%, ఐఓసీ 2.48% పెరిగాయి. స్పైస్‌జెట్ 6.72%, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో) 3.59% రాణించాయి. జేఎస్‌డబ్ల్యూ డ్యూలక్స్ 2.15%, ఇండిగో పెయింట్స్ 1.30%, షాలిమర్ పెయింట్స్ 0.82%, బెర్జర్ పెయింట్స్ 0.75%, కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ 0.18% లాభపడ్డాయి. వేదాంత విభజిత కంపెనీల లిస్టింగ్: సోమవారం దేశీయ స్టాక్‌మార్కెట్లో వేదాంతాకు చెందిన 4 విభజిత కంపెనీలు నమోదయ్యాయి. వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్, అల్యూమినియం మెటల్ షేర్లు అరంగేట్రం చేశాయి.



## అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల వ్యక్తి మస్క్: ఆనంద్ మహీంద్రా



**న్యూఢిల్లీ:** భవిష్యత్తును ఊహించడమే కాదు.. దానికి మొండి పట్టుదల తోడైతే ఆయనే ఎలాన్ మస్క్. స్పేస్‌ఎక్స్, టెస్లా, స్టార్‌లింక్.. ఇలా కొంగొత్త ఆలోచనలతో వ్యాపారంలో తనదైన ముద్ర వేశారు. ఇటీవల స్పేస్‌ఎక్స్ లిస్టింగ్ ద్వారా తొలి ట్రిలియనీర్‌గా అవతరించారు. ఈ స్థాయి సంపదకు చేరుకున్న తొలి వ్యక్తి ఆయనే. ఈ ఘనతను సాధించడానికి ఆయన ఎన్నో సవాళ్లను అధిగమించారని ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. ఆ విజయం వెనుక అచంచలమైన విశ్వాసం దాగి ఉందని, అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల వ్యక్తి అంటూ ఓ ఇంటర్వ్యూలో మస్క్‌ను కొనియాడారు. “2018లో ఎలాన్ మస్క్‌ను కలిశాను. ఆ సమయంలో ఆయన చాలా గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలోనూ ఆటంకాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ వెనకడుగు వేయలేదు. ఆనంద క్షణాల కంటే కఠినమైన పరిస్థితులనే ఆవిష్కర్తలు ముందుగా అంచనా వేస్తారు. క్లిష్ట పరిస్థితులను అధిగమించారు. ఈ రోజు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకున్న వ్యక్తిగా హెడ్‌లైన్స్‌లో ఆయన్ను చూస్తున్నాం. నేడు అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేయగలననే గట్టి నమ్మకం ఉన్న వ్యక్తి. దృఢ సంకల్పంతో వాటిని ఆయన అధిగమించిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది” అని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు.

### ఆ విషయంలో కంపెనీ విఫలమయ్యింది: మెటా సీటీవో ఆండ్రూ

**వాషింగ్టన్:** ఏఐ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా మెటా ఇటీవల పలు కీలక మార్పులు చేసింది. ఈ ఏడాది మార్చిలో ఈ టెక్ దిగ్గజం ఒక కొత్త అప్లైడ్ ఏఐ విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఇందులోభాగంగా సుమారు 6,500 మంది ఇంజినీర్లు, ప్రొడక్ట్ మేనేజర్లను వివిధ బృందాల నుంచి ఏఐ ప్రాజెక్టులపై పనిచేయడానికి బదిలీ చేశారు. అయితే, కంపెనీ నిర్ణయంతో ఈ విభాగానికి బదిలీ అయిన సిబ్బంది అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ విషయంపై మెటా సీటీవో ఆండ్రూ బాస్‌వర్త్ మాట్లాడుతూ.. ఏఐ పునర్ వ్యవస్థీకరణ విషయంలో కంపెనీ సరైన నిర్ణయం తీసుకోలేకపోయిందని అంగీకరించారు. కృత్రిమ మేధ విభాగాన్ని సరికొత్తగా తీసుకురావడంలో మెటా దారుణంగా వ్యవహరించిందని ఆండ్రూ వ్యాఖ్యానించారు.

## చిన్నారికి రిలయన్స్ ఫౌండేషన్ పునర్జన్మ



**ముంబై:** ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ చిన్నారికి రిలయన్స్ ఫౌండేషన్ అండగా నిలిచింది. సర్ హెచ్.ఎన్. రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటల్‌లో గుండె మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించి ఆ చిన్నారికి సాధారణ జీవితం ప్రసాదించింది. ప్రస్తుతం ఆ చిన్నారి అందరి పిల్లల్లానే స్కూలుకు వెళుతోందంటూ రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ నీతా అంబానీ ఓ తొమ్మిదేళ్ల బాలిక కథను పంచుకున్నారు. లావణ్య తీవ్రమైన గుండె వైఫల్యంతో బాధపడుతున్న సమయంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆస్పత్రికి వచ్చారు. గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే ప్రాణాలు కాపాడే మార్గమని వైద్యులు చెప్పారు. లావణ్య తండ్రి ఆమెను వదిలేసి వెళ్లిపోవడంతో తల్లి ఒక్కరే ఆ భారాన్ని మోస్తున్నారు. రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో లావణ్యకు సంక్లిష్టమైన గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. నెమ్మదిగా కోలుకున్న లావణ్య ఇప్పుడు పూర్తి ఆరోగ్యంతో ఉంది. స్కూల్‌కు వెళ్తూ, స్నేహితులతో ఆడుకుంటూ సాధారణ జీవితాన్ని గడుపుతోందని లావణ్య గురించి నీతా అంబానీ చెప్పుకొచ్చారు. దీంతో సభలో చప్పట్లు మార్మోగాయి. రోగులకు సేవ చేయడమే తమ ధర్మమని, ప్రతి ఆసుపత్రి ఒక దేవాలయం లాంటిదని నీతా అంబానీ అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను అందుబాటులోకి, సరసమైన ధరల్లో తీసుకురావడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని చెప్పారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

## 6 నెలల్లో 23 కంపెనీలు.. ఇంకా 235 ఐపీఓలు వెయిటింగ్!

**న్యూఢిల్లీ:** వారానికి కనీసం ఒకట్రెండు ఐపీఓలు.. నెలలో ఒక్క కంపెనీ గురించైనా చర్చ.. బంపర్ సబ్‌స్క్రిప్షన్‌లు.. అదిరిపోయే లిస్టింగ్‌లు.. గతేడాది ఐపీఓల పరిస్థితి. ఈ ఏడాది ప్రాథమిక మార్కెట్ అందుకు భిన్నంగా నడుస్తోంది. 2026 క్యాలెండర్ సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తి కావస్తోంది. ఇప్పటి వరకు 23 కంపెనీలు కేవలం రూ.27వేల కోట్లు మాత్రమే సమీకరించాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థూల ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడుదొడుకుల కారణంగా మందగమనం నెలకొంది. ఈ మేరకు ఈక్విరస్ క్యాపిటల్ మంగళవారం ఓ నివేదిక వెలువరించింది. 2025లో 103 ఐపీఓలు సందడి చేశాయి. మార్కెట్ నుంచి సంయుక్తంగా రూ.1.76 లక్షల కోట్లు సమీకరించాయి. 2024లో 90 సంస్థలు రూ.1.6 లక్షల కోట్లు, 2023లో 57 కంపెనీలు రూ.49,436 కోట్లు సమీకరించాయి. గతేడాది సెప్టెంబర్ 25న ఒక్కరోజే 25 ఇష్యూలు వచ్చాయి. 2025 క్యాలెండర్ సంవత్సరం చివరి త్రైమాసికంలో ఏకంగా 30 కంపెనీలు రూ.91,058 కోట్లు సమీకరించాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 19 కంపెనీలు రూ.24,772 కోట్లు నిధులు పొందాయి. రెండో త్రైమాసికంలో నాలుగు కంపెనీలు కేవలం రూ.2,422 కోట్లు మాత్రమే సమీకరించాయి. ముఖ్యంగా గతేడాది సెప్టెంబర్ తర్వాత మార్కెట్ పరిస్థితులు ప్రతికూలంగా మారడం, మదుపర్ల అప్రమత్తత కారణంగా ఐపీఓల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అయితే, ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతోంది. ఐపీఓ కార్యకలాపాలు పుంజుకొంటున్నాయి. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్, హెక్సాగాన్ న్యూట్రిషన్ వంటి కంపెనీలు జూన్ నెలలో ఐపీఓకు వచ్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో మరికొన్ని కంపెనీలు ఐపీఓకు సన్నద్ధమవుతున్నాయి.

# ఇ20 పెట్రోల్ వాడితే బీమా వర్తించదా?

### క్లెయిమ్‌ల తిరస్కరణపై వస్తున్న వదంతుల్లో నిజం లేదు
### బీమా సంస్థల స్పష్టత




**న్యూఢిల్లీ:** దేశంలో పర్యావరణ పరిరక్షణకు ఉపకరించడంతో పాటు, ఇంధన దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ 20 (20% ఇథనాల్ కలిపిన పెట్రోల్) ఇంధన వినియోగంపై వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలకు తెరపడింది. ‘పాత వాహనాల్లో ఇ20 పెట్రోల్ వాడితే వాహన బీమా వర్తించదు’ అంటూ కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారంలో నిజం లేదని బీమా సంస్థలు స్పష్టం చేశాయి. ‘2023 ఏప్రిల్ కంటే ముందు తయారైన పాత వాహనాల ఇంజిన్లు ఇ 20 పెట్రోల్‌కు పూర్తిగా అనుకూలంగా లేవు. ఈ ఇంధనాన్ని వాడటం వల్ల, ఆయా వాహనాల ఇంజిన్ భాగాలు దెబ్బతినే అవకాశం ఉందంటూ ఇటీవల కొన్ని విశ్లేషణలు వెలువడ్డాయి. వీటి ఆధారంగా ‘పాత వాహనాలు, కార్లలో ఇ20 పెట్రోలు కొట్టించడం వల్ల వాహనం పాడైతే.. బీమా కంపెనీలు దానిని వాహనదారుల నిర్లక్ష్యం కింద పరిగణిస్తాయి. తద్వారా ఇన్సూరెన్స్ పాలసీలు రద్దవుతాయి. క్లెయిములు రావు’ అని వదంతులు రేగాయి. ఇవి పెద్దఎత్తున వైరల్ కావడం, పెట్రోల్ బంకుల్లో దాదాపు అంతటా ఇ20 పెట్రోలే దొరుకుతుండటంతో, పాత వాహనదారులు తీవ్ర అయోమయానికి, ఆందోళనకు గురవుతున్నారు. ఈ గందరగోళంపై ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ స్పందించింది. ‘ఇ20 పెట్రోల్ వినియోగించినా, మోటార్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రామాణికతకు భంగం వాటిల్లదు. పాత వాహనాల్లో ఈ ఇంధనాన్ని వాడటాన్ని మేమేమీ నిర్లక్ష్యంగా భావించం. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రగతిశీల అడుగుగా ఇ20 ఇంధనాన్ని భావిస్తున్నాం’ అని కంపెనీ స్పష్టం చేసింది. వాహన బీమా అనేది నిర్దిష్ట ఒప్పందం ప్రకారం నడుస్తుంది. పాలసీ నిబంధనల ప్రకారం క్లెయిమ్‌లు అనేవి ప్రమాదాలు, దొంగతనాలు, ఓనర్–డ్రైవర్, సహ ప్రయాణికులకు జరిగే వ్యక్తిగత ప్రమాదాలు, థర్డ్ పార్టీ నష్టపరిహారాల ఆధారంగా మంజూరవుతాయి. వాహనంలో ఎలాంటి ఇంధనాన్ని వాడుతున్నారనే అంశానికి, క్లెయిమ్‌కూ సంబంధం లేదని ఐసీఐసీఐ లాంబార్డ్ తేల్చి చెప్పింది. సాధారణ పెట్రోల్/డీజిల్‌తో నడిచే వాహనానికి ప్రమాదం జరిగితే క్లెయిమ్ ఎలా ఇస్తారో, ఇ20 ఇంధనం వాడే వాహనానికీ బీమా అలాగే లభిస్తుంది. ఇంధనం సాకుగా చూపి బీమా క్లెయిములు తిరస్కరించబోమని బీమా సంస్థ పేర్కొంది. బీమా రంగ నిపుణుల ప్రకారం, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఇంధనంతో సంబంధం లేకుండా 100% బీమా వస్తుంది. ప్రమాదాలతో సంబంధం లేకుండా, ఇంజిన్లలో ఇథనాల్ రసాయన చర్యల వల్ల కాలక్రమేణా వచ్చే అరుగుదల లేదా ఇంజిన్ పాడైపోవడం అనేది ఏ సాధారణ వాహన బీమా పాలసీ పరిధిలోకి రాదు. ఇది ఇ20 పెట్రోల్‌కే కాదు.. సాధారణ పెట్రోల్ వాడి, ఇంజిన్ చెడిపోయినా ఇదే నిబంధన. దీనికోసం ప్రత్యేకంగా ‘ఇంజిన్ ప్రొటెక్షన్’ లాంటి అనుబంధ పాలసీ (యాడ్–ఆన్) కవర్ తీసుకోవాలి. వాహనానికి సరైన బీమా పాలసీ ఉందా? అనేది మాత్రమే చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా ఇంధన మార్పులు సహజమని, దానికి అనుగుణంగానే బీమా సేవలు ఉంటాయని బీమా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## టెలిగ్రామ్‌పై ఆంక్షలు

ప్రముఖ మెసే జింగ్ యాప్ టెలిగ్రామ్‌ను కేంద్రం బ్లాక్ చేసిం ది. నీట్ రీటెస్ట్ జూన్ 21న నిర్వహిస్తుండగా.. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సుల మేరకు ఈ తాత్కాలిక ఆంక్షలు విధించింది. అలాగే జూన్ 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను భారత్‌లో డిసేబుల్ చేయాలని టెలిగ్రామ్‌ను ఆదేశించింది. టైమ్‌స్టాంప్‌ను అలాగే ఉంచుతూ గతంలో పోస్ట్ చేసిన మెసేజ్‌లను సవరించడంతో పాటు, పేపర్ లీక్ సాక్ష్యాలను, నిందితులను తారుమారు చేసేందుకు ఈ ఫీచర్‌ను ఉపయోగిస్తున్నట్లు ఎన్టీఏ గుర్తించింది. తమకు ప్రశ్నపత్రం యాక్సెస్ ఉందని మోసపూరిత ప్రచారం చేస్తోన్న అనేక ఛానళ్లు, గ్రూప్‌లు, బాట్‌లను అధికారులు ఇప్పటికే తొలగించారు. అయితే ఈ చర్యలు సరిపోవని భావించడంతో, ఆంక్షల అవసరం ఏర్పడిందని ఎన్టీఏ వెల్లడించింది. ఈ ఆంక్షల వల్ల చట్టబద్ధమైన యూజర్లకు అసౌకర్యం ఏర్పడనుంది. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ.. దేశంలో అత్యంత కీలమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్ సమగ్రతను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొంది. గతనెల 3న జరిగిన నీట్ ప్రశ్న పత్రాలు లీకైన నేపథ్యంలో దాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ‘నీట్ – యూజీ’ని ఈనెల 21న తిరిగి నిర్వహించనున్న నేపథ్యంలో, ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లుచేసినట్లు కేంద్ర ఆరోగ్య, విద్యాశాఖల ఉన్నతాధికారులు ఇటీవల పార్లమెంటరీ సంఘానికి వెల్లడించారు.

## మీ సర్కారులో అన్నీ స్కాంలే..

ఉండి అసలు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నారు. యూనిఫాంలు, టైల కోసం రూ. 1200 కోట్ల టెండర్ పిలిస్తే, ఉప్పులు, పప్పులు, చికెన్ కోసం రూ.800 కోట్ల టెండర్ పిలిచారు.. రెండు కలిపితే రూ.2000 కోట్లన్నారు. టెండర్లు పిలిచిన విషయం ఈ మంత్రులకు తెలియకపోతే మీరు ఏం పాలన చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదని హరీశ్ రావు అన్నారు. ఎంత కొన్నారో, ఎంత టెండర్లు పిలిచారు తెలియలేదు అంటే మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను. ముఖ్యమంత్రే మొత్తం టెండర్లు పిలిచి ఆ అనుముల అన్నా తమ్ముళ్లు మొత్తం మింగుతున్నారు.. అందుకే మీకు ఏమీ తెలియదు. కోటిమంది మహిళలను కోటీశ్వర్లను చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పాడు.. కోటి మంది మహిళలు కోటీశ్వర్లు కాలేదు కానీ అనుముల వారి నలుగురు అన్నా తమ్ముళ్లు మాత్రం కోటీశ్వర్లు అయ్యారని పేర్కొన్నారు. కొత్త డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ శాఖలో 19 వేల ఖాళీలు ఉన్నాయని అన్నాడు.. కానీ మొన్న సీఎం రేవంత్ రెడ్డి ఏమో కేవలం 5 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని అంటున్నాడు. మరి అందరికీ ఉద్యోగాలు ఇయ్యరా..? మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ఒకేసారి 17 వేల ఖాళీలుంటే 17 వేలకు నోటిఫికేషన్లు ఇచ్చారు. మరి రేవంత్ రెడ్డి ఎందుకు 5 వేల ఉద్యోగాలే నింపుతా అంటున్నవ్.. చిక్కడ పల్లి సెంట్రల్ లైబ్రరీలో, దిల్ సుఖ్ నగర్‌లో పిల్లలు రోడ్లపైకి వచ్చి 19 వేల నోటిఫికేషన్లు వేయాలని ధర్నా చేస్తే.. ఈ రేవంత్ రెడ్డికి చీమ కుట్టనట్టు కూడా లేదు. ఎన్నికల ముందు పరీక్షల ఫీజు ఫ్రీ అన్నాడు. ఇప్పుడు రూ.400 ఫీజు ఉంటే వాటిని రూ.800 చేశాడు. ఎన్నికల ముందైతే ఫ్రీ ఎన్నికల తర్వాతైతే డబుల్ అన్నట్టు అని మండిపడ్డారు

## అసత్యప్రచారాలు మానండి

రూ. 1200 కోట్ల టెండర్ పిలిస్తే, ఉప్పులు, పప్పులు, చికెన్ కోసం రూ.800 కోట్ల టెండర్ పిలిచారు.. రెండు కలిపితే రూ.2000 కోట్లన్నారు. టెండర్లు పిలిచిన విషయం ఈ మంత్రులకు తెలియకపోతే మీరు ఏం పాలన చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదని హరీశ్ రావు అన్నారు. అయితే హరీష్ ఆరోపణలపై మంత్రి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. గురుకులాల టెండర్లలో రూ.2 వేల కోట్ల స్కాం జరిగిందని నిరూపించాలంటూ హరీశ్ రావుకు బహిరంగ సవాల్ విసిరారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని నిరూపిస్తే నేను నా మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేస్తా. ఇందుకు సంబంధించిన చర్చకు వేదిక ఎక్కడో నువ్వే చెప్పు.. నేను, నా శాఖకు సంబంధించిన అధికారులందరం అక్కడికి వస్తాం. ఒకవేళ నువ్వు నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి వైదొలగుతావా హరీష్‌రావు అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. మరోవైపు మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హరీశ్ రావు ఆరోపణలను కొట్టిపారేశారు. అసలు తాము టెండర్ల ద్వారా కొనుగోలు చేసిన మొత్తమే చాలా తక్కువగా ఉంటే, వేల కోట్ల అవినీతి ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

## నాపై ఆరోపణలు నిరూపించండి

ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు. “తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్–1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు.

**తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడా**

తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్–2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలే. 50 ఏళ్లు వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం” అని వివరించారు.

# రైల్వే మంత్రితో భేటీ ఏర్పాటు చేయించండి

- ఎప్పుడైనా ఎక్కడైనా సిద్ధమే...మీ కాల్ కోసం ఎదురుచూస్తా
- అవసరమైన అన్ని పత్రాలతో వచ్చి స్పష్టత ఇస్తా
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ
- బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై సీఎం సమీక్ష



**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. మెట్రో రైలు ప్రాజెక్టు వ్యవహారంలో ఇటీవల సీఎం చేసిన విమర్శలపై కిషన్‌రెడ్డి స్పందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైల్‌కు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కిషన్‌రెడ్డిని కోరారు. “సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా నేను ఎప్పుడూ సిద్ధమే. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వీలైనంత త్వరగా భేటీ ఏర్పాటు చేయించాలి. ఆ సమావేశానికి సంబంధించి మీ కాల్ కోసం ఎదురు చూస్తాను. అన్ని పత్రాలతో వచ్చి స్పష్టత ఇస్తా. ఈ అంశంలో మీతో వ్యక్తిగత భేటీకి కూడా సిద్ధమే. ఎక్కడికైనా, ఎప్పుడైనా డాక్యుమెంట్లు, అధికారులతో వస్తాను” అని పేర్కొన్నారు.

**బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై సీఎం సమీక్ష**

అంతకుముందు బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్టు అంశాలపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్–పుణె రైల్వే మార్గంలో అనంతగిరి వద్ద స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని.. అక్కడి నుంచి ఐటీ హబ్‌కు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. హైదరాబాద్– బెంగళూరు రైల్వేమార్గంలో ఫ్యూచర్ సిటీలో స్టేషన్ ఏర్పాటు చేయాలి. మన్ననూర్ వద్ద నల్లమల స్టేషన్, సోమశిల సమీపంలో స్టేషన్ ప్లాన్ చేయాలని సూచించారు. టూరిజం ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే లైన్ ఉండాలన్నారు. కాకతీయ సామ్రాజ్యం, వారసత్వ సంపద ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్టు ఉండాడని సీఎం దిశానిర్దేశం చేశారు. ఎయిర్‌పోర్టు ముందు రుద్రమదేవి, రుద్రదేవుడు, నంది విగ్రహంతో ఐలాండ్ ఉండాలన్నారు. ఎయిర్‌పోర్టు డిజైన్లపై దిల్లీ వెళ్లి ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులతో చర్చించాలని అధికారులకు సూచించారు.

## నోయిడా విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రారంభం

**నోయిడా:** లఖ్‌నవూలో సోమవారం ఉదయం 7.12 గంటలకు బయలుదేరి, 7.58 గంటలకు ల్యాండ్ అయిన ఇండిగో విమానంతో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల విమానాల రాకపోకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. మళ్లీ 8.10 గంటలకు ఇక్కడి నుంచి తొలి విమానం బయలుదేరి లఖ్‌నవూకు వెళ్లింది. విమానాశ్రయం మొదటి దశ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి భూములు ఇచ్చిన జేవార్ ప్రాంతానికి చెందిన 172 మంది రైతులతో స్థానిక ఎమ్మెల్యే, పలువురు అధికారులు ఆ విమానంలో ప్రయాణించారు. ఈ విమానాశ్రయ ప్రారంభంతో, ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలున్న మహా నగరాల జాబితాలోకి దిల్లీ ఎన్‌సీఆర్ కూడా చేరింది. పదేళ్ల క్రితం అసాధ్యం అనిపించిన ఈ కలను, ప్రధాని నరేంద్ర మోదీ సుసాధ్యం చేశారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు.

# వర్షాకాల సమస్యల పరిష్కారానికి సర్వసన్నద్ధం

## శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చెరువులు, నాళాల ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సమీక్ష

- వాటర్ లాగింగ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి
- అక్రమ నిర్మాణాలు తొలగించి, ప్రక్షాళన చేయాలి
- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు





**శేరిలింగంపల్లి, జూన్ 16 (జనంసాక్షి):** నైరుతి రుతుపవనాల వ్యాప్తితో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వర్షాల వల్ల కలిగే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సర్వసన్నద్ధంగా అధికారులంతా సిద్ధంగా ఉండాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సూచించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మల్కం చెరువు, దుర్గం చెరువు, గురునాథం చెరువు, గంగారాం చెరువు ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లు, బయో డైవర్సిటీ జంక్షన్, కొత్తగూడ సంతోష్ డాబా, నెక్టర్ గార్డెన్, జూబ్లీ గార్డెన్ మరియు వాటర్ లాగింగ్ పాయింట్ల సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల నిమిత్తం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, సీఎంసీ కమిషనర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ తదితరులతో కలిసి ఆయన మంగళవారం పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, సమిష్టి కృషితో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వసన్నద్ధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మకమైన ప్రాంతాలు, లోతట్టు వర్షపు నీటి నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని నీటిపారుదల, ఇంజనీరింగ్ భాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రధాన సమస్య అయిన వాటర్ లాగింగ్ పాయింట్లపై ఇష్టమైన ప్రణాళికను అమలు చేస్తూ శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు కొనసాగించి ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందుల నుండి వెసులుబాటు కల్పించాలని కమిషనర్ సృజనకు విజ్ఞప్తి చేశారు. శేరిలింగంపల్లి పరిధి ఆయా చెరువులు, నాళాల ఇన్‌లెట్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంవల్ల అవి కుంచించుకుపోవడంతోపాటు చెత్తాచెదారం వచ్చి చేరడంతో కాలనీ పరిధిలో మురుగు సమస్య తీవ్రం కావడం జరిగిందని, దీనిపై అధికారులు నిర్మాణాత్మక చర్యలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వరద నీటి సరఫరా సాఫీగా సాగేలా కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో అకాల వర్షాలతో వివిధ కాలనీలు, లోతట్టు ప్రాంతాలు తీవ్రమైన వరద నీటి ముప్పును ఎదుర్కొంటున్నాయని, తద్వారా అనేక సమస్యలు తలెత్తడంతోపాటు అనారోగ్య సమస్యలు పెరిగిపోయి నిరుపేదల జీవితాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతు న్నాయని అరికెపూడి గాంధీ వివరించారు. ప్రతి చెరువుకు వెళ్లే ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇన్‌లెట్‌లో చెత్త చెదారం పేరుకుపోకుండా వరద నీరు సాఫీగా సాగేలా చూడాలని, నాళాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని, ఎవరైనా అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ సీపీని కోరారు. నాళాలను అక్రమిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని, పూర్తి స్థాయిలో నాళాల ప్రక్షాళన జరగాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన నాళాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అరికెపూడి గాంధీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి డీసీపీలు చింతమనేని శ్రీనివాస్, రితి రాజ్, శేరిలింగంపల్లి ఉప కమిషనర్ బాలకృష్ణ, మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖ, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం, ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ విభాగం, ట్రాఫిక్ విభాగం, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ వర్సిటీలో 550 పోస్టుల భర్తీకి సీఎం గ్రీన్ సిగ్నల్



- అల్దాస్ జానయ్య రచనలు ఆవిష్కరించిన రేవంత్
- తెలంగాణ వ్యవసాయం 2047 సవాళ్లు, ఇందిరా గ్రీన్ రివల్యూషన్ పుస్తకాలు
- రాత పరీక్ష ఆధారంగా పారదర్శక నియామకాలు

**రాజేంద్రనగర్, జూన్ 16 (జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వ్యవసాయ శాఖ సమీక్షా సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య రచించిన "తెలంగాణ వ్యవసాయం 2047 – సవాళ్లు, విధాన మార్గదర్శకాలు" నివేదికతో పాటు "ఇందిరాగాంధీ – ఆర్కిటెక్ట్ ఆఫ్ ఇండియా గ్రీన్ రివల్యూషన్" పుస్తకాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్దాస్ జానయ్యను సీఎం అభినందించారు. అదే సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న సుమారు 550 బోధనా సిబ్బంది పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. సంబంధిత ప్రతిపాదనలను వేగంగా ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. రాత పరీక్ష ఆధారంగానే, ఎలాంటి మౌఖిక పరీక్షలు లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపడతామని ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- 17 స్కూల్ బస్సులు, 50 ఆటోలు సీజ్
- 87 వాహనాలపై చట్టపరమైన చర్యలు
- ప్రతి చిన్నారి భద్రత మనందరి బాధ్యత



**కరీంనగర్ బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాఠశాల విద్యార్థుల రవాణా వాహనాల భద్రతపై పోలీసు, రోడ్డు రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రవాణాలో నిమగ్నమైన వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు, మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని 17 స్కూల్ బస్సులు, 50 ఆటోలను సీజ్ చేశారు. సరైన పత్రాలు (రిజిస్ట్రేషన్, పర్మిట్, ఇన్సూరెన్స్) లేని 64 వాహనాలపై, యూనిఫాం ధరించని 13 మంది డ్రైవర్లపై, నంబర్ ప్లేట్ లేని వాహనం, ఓవర్‌లోడింగ్‌తో నడుపుతున్న 9 వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. మొత్తంగా 87 వాహనాలపై ఉల్లంఘనలు నమోదు చేశారు.

ప్రతి చిన్నారి భద్రత మనందరి బాధ్యత అని పేర్కొంటూ, పాఠశాల వాహనాల డ్రైవర్లు నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదని, వాహనాలకు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్, ఇతర పత్రాలు ఉండాలని, వేగ నియంత్రణ పాటిస్తూ, మొబైల్ ఫోన్ వినియోగం లేదా మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. కవిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులపై రవాణ శాఖ అధికారుల తనిఖీలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 16 (జనంసాక్షి) :** పాఠశాలలు ప్రారంభం కావడంతో రవాణ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల భద్రతే లక్ష్యంగా స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం వేములవాడ నందికమాన్ వద్ద తనిఖీలు నిర్వహించిన అధికారులు నిబంధనలు పాటించని అల్ఫోర్ పాఠశాల బస్సును గుర్తించారు. విద్యార్థులతో ప్రయాణిస్తున్న బస్సును నిలిపివేసి అధికారులు వాహన ధ్రువీకరణ పత్రాలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. తనిఖీల సమయంలో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిన బస్సు డ్రైవర్‌కు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం, ఐడీ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల సంఖ్యకు మించి స్కూల్ బస్సులో ఎక్కించుకోవద్దని పాఠశాల యాజమాన్యాలకు స్పష్టమైన హెచ్చరిక చేశారు. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. వేగ పరిమితిని పాటిస్తూ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్రైవర్లకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాల వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు.

# 2014 అధ్యాపకులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలి

**తెలంగాణ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లకు టౌటా వినతి**

**కాలయాపన చేస్తే నిరసనలు తప్పవు: టౌటా రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం**

**సికింద్రాబాద్(జనంసాక్షి):** తెలంగాణ యూనివర్సిటీలో 2014లో నియామకమైన అధ్యాపకులందరికీ హైకోర్టు డివిజన్ బెంచ్ తుది తీర్పులకు లోబడి తక్షణమే పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) డిమాండ్ చేసింది. ఈ మేరకు 'టౌటా' రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో టౌటా నాయకులు మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరిలను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల పదోన్నతులపై సానుకూలంగా ఉన్నా, వర్సిటీ అధికారులు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గత 12 ఏళ్లుగా ప్రమోషన్లు లేక అధ్యాపకులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం అధికారులు కాలయాపన చేయకుండా ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

# ఇందుర్తిలో మురిగిపోతున్న రేషన్ బియ్యం

- 8నెలలుగా కిరాయి ఇంట్లో మగ్గుతున్న పేదలకు అందాల్సిన రేషన్ రైస్
- దుర్వాసనతోపాటు లక్కపురుగుతో ఇంటి యజమానుల అవస్థలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



**చిగురుమామిడి జూన్ 16(జనంసాక్షి):** పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యంను సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో మురిగిపోతున్నాయని, దీంతో తమకు ఇబ్బంది అవుతుందని ఇందుర్తి గ్రామానికి చెందిన గట్టు రాములు, గట్టు జనార్దన్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గట్టు రాములు, జనార్దన్ గౌడ్ లు మాట్లాడుతూ బురికి హనుమంతు అనే రేషన్ డీలర్ అనారోగ్యతో మృతి చెందడంతో, అదే గ్రామానికి చెందిన మరో డీలర్ దుస్స రాజమణికి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. పలు ఆరోపణల నేపథ్యంలో వారిని సస్పెండ్ చేయడంతో 8నెలలుగా రేషన్ షాపులో దాదాపు 50క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యం తాళం వేసి ఉన్న గదిలో మురిగిపోతున్నాయని ఇంటి యజమాని గట్టు రాములు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం మురిగిపోవటం, లక్క పురుగు దుర్వాసన వెదజల్లడంతో తమ ఆరోగ్యపరిస్థితి అగమ్య గోచరంగా ఉందని ఇంట్లో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎవరికి చెప్పిన పట్టించుకోవడంలేదని, వెంటనే రేషన్ బియ్యాన్ని తొలగించి, తమకు రావాల్సిన కిరాయి డబ్బులు ఇప్పించాలని సంబంధిత అధికారులను వారు వేడుకుంటున్నారు.

# బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**దోమ జూన్ 16 జనం సాక్షి :** దోమ మండలం కొండపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్బిఐ ఏజీఎం శ్రీకాంత్ గోవుల, ఎల్ డి ఎం యాదగిరి మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆర్థిక మోసలా పట్ల అప్రమత్తంగా ఉండాలి అన్నారు. పొదుపులు మరియు సామాజిక భద్రత పథకాలు ఆర్థిక నేరాలు మరియు సైబర్ క్రైమ్ వీటి పైన కూడా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివో ఏ లు గ్రామ సంఘం సభ్యులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాండ్ కళాకారులకు ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

- పెన్షన్, వడ్డీ రహిత రుణాలు, సంక్షేమ బోర్డు డిమాండ్
- సౌండ్ పొల్యూషన్ కంట్రోల్ కమిషన్ ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి హామీ
- కళాకారుల సంక్షేమం కోసం సానుకూల నిర్ణయాలు




**ముషీరాబాద్, జూన్ 16 (జనంసాక్షి):** బ్యాండ్, వాయిద్య కళాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం బ్యాండ్ కళాకారులకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి, 1000 కోట్ల నిధి కేటాయించాలని తెలంగాణ బ్యాండ్, వాయిద్య కళాకారుల రాష్ట్ర సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మాట్లాడుతూ అర్హులైన బ్యాండ్, వాయిద్య కళాకారులకు భాష సాంస్కృతిక శాఖలో భాగంగా గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. బ్యాండ్ వాయిద్య కళాకారులకు పెన్షన్, ప్రత్యేక సంక్షేమ బోర్డు అంశంపై సానుకూల నిర్ణయం తీసుకునేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి శాసనసభలో నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సమాజంలో అనాదిగా వస్తున్న కళలు, కళాకారులను పరిరక్షించడం, ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో బ్యాండ్, వాయిద్య కళాకారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. పండుగలు, జాతరలు, సామాజిక ఉద్యమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వాయిద్య కళాకారుల పాత్ర విశిష్టమైనదని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బ్రాండ్ వాయిద్య కళాకారులకు మద్దతిస్తూ మాట్లాడారు. కళాకారులు కోరేటివి స్వల్పమైన, న్యాయమైన డిమాండ్లని మా ప్రభుత్వం వస్తే ఈ డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. చెరుపల్లి సీతారామయ్య మాట్లాడుతూ వీరి డిమాండ్లు న్యాయమైనవని, వీరు అడిగిన బడ్జెట్‌ను కేటాయిస్తే ప్రభుత్వానికి భారమేమీ కాదని అన్నారు. సౌండ్ పొల్యూషన్ కంట్రోల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి నియమాలు విధించాలన్నారు. బివికేఎస్ నాయకులు మాట్లాడుతూ ప్యాడ్ బ్యాండ్ వెహికల్స్‌ను సీజ్ చేయరాదని, పోలీసుల వేధింపులు అరికట్టాలని కోరారు. హైదరాబాద్‌లో కళాకారుల శిక్షణ కేంద్రాలకు స్థలాలు కేటాయించాలని, ప్రతి బ్యాండ్ యూనిట్‌కు పది లక్షలు వడ్డీ రహిత రుణం అందించాలని, 50 సంవత్సరాలు దాటిన కళాకారులకు నెలవారీ పెన్షన్, ప్రమాదంలో మరణించిన కళాకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క, పలు జిల్లాల నుంచి వచ్చిన బ్యాండ్, వాయిద్య కళాకారులు, సంఘాల ప్రతినిధులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# 34వ డివిజన్‌లో కంపు కొడుతున్న పారిశుధ్యం

- అధికారుల పర్యవేక్షణ కరువు
- పనుల ఆలస్యం పైన ఎమ్మెల్యే అసహనం
- ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేయాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 16 జనంసాక్షి :**
జిల్లా కేంద్రంలోని 34 వ డివిజన్ పారిశుధ్యం లోపించి కంపు కొడుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ కరువై మరోవైపు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మా కాలనీ పట్టించుకుని సత్వరమే డ్రైనేజీలు వీధి దీపాలు పనులను పర్యవేక్షించి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. అనంతరం ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ నగరవాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం శానిటేషన్ పనులు కొనసాగించాలని స్పష్టం చేశారు నగరంలోని 34వ డివిజన్‌లో గల మిర్చి కాంపౌండ్ మార్వాడి వెల్లి పాత రమేష్ టాకీస్ రోడ్డు తదితర కాలనీలలో పర్యటించారు ఈ సందర్భంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నప్పుడు మాత్రమే కాకుండా నిరంతరం డ్రైనేజీ పరిశుభ్రత మంచినీటి సరఫరా వీధి దీపాల పనులను పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు అవసరమున్న చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని సూచించారు పలు కాలనీలలో మంచినీటి పైపులైన్లు లీకేజీలను గమనించి వాటిని అరికట్టాలని తెలిపారు ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందిన సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని నిత్యం పర్యవేక్షిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు లేనిపక్షంలో అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గంజి కమాన్ వద్ద కల్వర్టు గాంధీ గంజ్ కమాన్ వద్ద పూర్తయిన నేపథ్యంలో తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు సంబంధిత కాంట్రాక్టర్ కల్వర్టు మాత్రమే నిర్మించి వెళ్లిపోయారని ఆసహనం వ్యక్తం చేశారు. కల్వర్టు ఎత్తుగా నిర్మించినందున రోడ్డుకు సమాంతరంగా చేసి వెళ్లే బాధ్యత వారిది కాదని ప్రశ్నించారు వీలైనంత తొందరగా వాహన రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్, స్థానిక కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్, బిజెపి నాయకులు పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.







# అసలే పర్మిషన్ లేదు.. ఆపై క్రమశిక్షణా కరవు

## ఖమ్మం 'నారాయణ'కు రూల్స్ వర్తించవా?

- కళ్లు మూసుకున్న ఇంటర్ బోర్డు
- 'మామూళ్ల' అండతోనే పర్మిషన్ లేని దందా
- గతేడాది హాస్టల్‌లో వీధి రౌడీల్లా కొట్టుకున్నారాని జ్ఞానోదయం
- లక్షలు గుంజుతున్న కార్పొరేట్ మాయాజాలం
- 'జనంసాక్షి' కథనంతో కదులుతున్న డొంక

**ఖమ్మం బ్యూరో, జూన్ 16 జనంసాక్షి :**
సాధారణ విద్యాసంస్థలు ఒక చిన్న క్లాస్ రూమ్ అదనంగా పెడితేనే సవాలక్ష ప్రశ్నలు వేసి, కార్యాలయాల చుట్టూ తిప్పించుకునే ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు.. కార్పొరేట్ 'నారాయణ' సంస్థల అక్రమాలు మాత్రం కనిపించడం లేదు. ఖమ్మం నడిబొడ్డున ఎలాంటి అనుమతులు లేకుండానే ఐదంతస్తుల భవనంలో యథేచ్ఛగా నడుస్తున్న నారాయణ జూనియర్ కళాశాల బ్రాంచ్ వ్యవహారం ఇప్పుడు జిల్లాలో కలకలం రేపుతోంది. నిబంధనలన్నీ పేదలకేనా, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రూల్స్ వర్తించవా? అంటూ విద్యార్థి సంఘాలు, ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

### కళ్లముందే అనధికారిక బ్రాంచ్..

*అధికారులకు మాత్రం 'కనపడదు'*

ఖమ్మం ప్రధాన రహదారి వైరా రోడ్డు పక్కనే, ఐదంతస్తుల భారీ భవనంలో, కంటికి పొడుచుకునేలా పెద్ద హోర్డింగ్‌తో ఈ నారాయణ బ్రాంచ్ వెలిసింది. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తో పాటు ఇతర ఉన్నతాధికారులు నిత్యం ఇదే రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అయినా సరే, అంతపెద్ద భవనంలో పర్మిషన్ లేకుండా కాలేజీ నడుస్తున్న విషయం తమకు 'తెలియదు' అన్నట్లు అధికారులు వ్యవహరించడం వెనుక భారీ 'మామూళ్ల దందా' నడుస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నా అధికారులు మాత్రం "మేము పచ్చగా ఉంటే చాలు" అన్న ధోరణిలో ఉండటం శోచనీయం.

### క్రమశిక్షణ 'నిల్'.. గతేడాది వీధి రౌడీల్లా కొట్లాట

ఈ కాలేజీలో చదువు మాత్రమే కాదు, కనీస క్రమశిక్షణ కూడా కరువైందనడానికి గతేడాది జరిగిన ఘటనే సజీవ సాక్ష్యం. కొందరు హాస్టల్ విద్యార్థులు అర్ధరాత్రి పూట హాస్టల్ గదిలోనే వీధి రౌడీల కంటే ఘోరంగా ముష్టిఘాతాలు కురిపించుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. యాజమాన్యం పర్యవేక్షణ లోపం, కమర్షియల్ ధోరణి వల్లే విద్యార్థులు పెడదోవ పడుతున్నారని స్పష్టమవుతోంది.

### షోకాజ్ నోటీసులు 'హాస్యాస్పదం'

గతేడాది గొడవ జరిగిన సమయంలో.. అసలు అనుమతి లేని ఈ క్యాంపస్‌కు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి స్వయంగా వెళ్లి విచారణ జరపడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం అప్పట్లో పెద్ద ఫార్స్ (డ్రామా)గా మారింది. నోటీసులు ఇచ్చి ఏడాది గడుస్తున్నా, నేటికీ ఆ పర్మిషన్ లేని బ్రాంచ్‌లోనే అడ్మిషన్లు జరుగుతుండటం అధికారుల 'నిర్వాకానికి', 'సహకారానికి' అద్దం పడుతోంది.

### తల్లిదండ్రులారా.. తస్మాత్ జాగ్రత్త!

బ్రాండ్ పేర్లు చూసి, రంగుల ప్రకటనలు నమ్మి లక్షల రూపాయల ఫీజులు పోసే ముందు తల్లిదండ్రులు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. కనీస అనుమతులు లేని, విద్యార్థుల భద్రతకు గ్యారంటీ లేని ఇలాంటి కళాశాలల్లో పిల్లలను చేర్చి వారి భవిష్యత్తును ప్రమాదంలో పడేయవద్దని విద్యా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ అనధికారిక క్యాంపస్‌పై కఠిన చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.



# లేచిన పూర్వ విద్యార్థులు

# మొదలైన మహా ఉద్యమం

# మా బడి మళ్లీ వెలగాలి

**గుండె తడిచే జ్ఞాపకాలు... చెరిగిపోని ముద్రలు**

**రవీంద్ర ఉన్నత పాఠశాల మహాగాథ**

*ఒకప్పుడు ఆ గేటు దాటితే చాలు.. పుస్తకాల వాసన, పిల్లల నవ్వులు, గురువుల ఆప్యాయమైన మందలింపులు. ఆ ప్రాంగణమే ఒక చిన్న ప్రపంచంలా ఉండేది. సైకిళ్లపై వచ్చే పిల్లలు, కాలినడకన వచ్చే విద్యార్థులు, ఒంటెద్దు బండ్లపై వచ్చే బాలికలు.. అందరి కలల బడి రవీంద్ర ఉన్నత పాఠశాల.*

*ఈరోజు ఆ చెట్లు ఎండిపోయాయి. ఆ తరగతి గదులు నిర్జనంగా ఉన్నాయి. ఒకప్పుడు పచ్చదనంతో తులతూగిన ఆ ఆవరణం ఈరోజు ఒక ఎడారిని తలపిస్తోంది. కానీ ఆ బడిలో చదివిన పూర్వ విద్యార్థుల గుండెల్లో ఆ జ్ఞాపకాలు ఇంకా జీవిస్తున్నాయి. అందుకే వారు లేచారు. "సేవ్ రవీంద్ర హైస్కూల్" అని గొంతు విప్పారు.*

శాంతినగర్/వడ్డేపల్లి, జూన్ 16 (జనంసాక్షి)




## అది కేవలం బడి కాదు... అది ఒక శకం

1968లో శాంతినగర్ గ్రామంలో మొదలైన ఆ పాఠశాల చరిత్ర అసాధారణమైనది. ఇటుక మేడలు కట్టుకోవడానికి డబ్బు లేని కాలంలో పూరి గుడిసెల్లో, ఆరుబయట చెట్ల నీడలో ఒక మహోన్నత ఆలోచన పుట్టింది. గురుదేవుడు రవీంద్రనాథ్ టాగోర్ శాంతినికేతన్‌లో చేసిన విద్యావిప్లవం స్ఫూర్తిగా ఆకాశమే పైకప్పుగా, భూమే పాఠశాలగా ఈ బడి తన మొదటి అడుగు వేసింది. గ్రామస్తులు విరాళాలు పోగేసారు. దాతలు భూమి ఇచ్చారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు మేకమూర్తయ్య, కమిటీ సభ్యులు తలశిల బసవ పున్నయ్య, ఉప్పల గోపాలకృష్ణమూర్తి, ఉప్పల లక్ష్మీనారాయణ వారంతా ఒక కలను నిర్మించారు. అది కేవలం భవనం కాదు, ఒక తరం భవిష్యత్తు. బొంకూరు నుండి కొంకల వరకు, జులకల్ నుండి మాన్దొడ్డి వరకు చుట్టుపక్కల పది పన్నెండు గ్రామాల పిల్లలు ఈ బడికే వచ్చేవారు. బాలికలు ఒంటెద్దు బండ్లపై, బాలురు సైకిళ్లపై, కొందరు మైళ్ల కొద్దీ కాలినడకన ఎంత దూరమైనా అడ్డు లేదు, ఎంత కష్టమైనా భయం లేదు. ఆ బడి చేరాలి, చదువుకోవాలి, ఆ ఊరి మర్యాద నిలబెట్టాలి. "రవీంద్ర స్కూల్‌లో చదివాను" అని చెప్పుకోవడం ఆ రోజుల్లో ఒక గర్వకారణం.

## గాయపడిన కల... శిథిలమైన స్వప్నం

కాలం క్రమంగా పగబట్టింది. ఒక్కొక్క ఉపాధ్యాయుడు రిటైరయ్యాడు. కొందరు విధి నిర్వహణలోనే కన్నుమూశారు. ప్రభుత్వం కొత్త శాశ్వత సిబ్బందిని నియమించే అవకాశం తొలగించింది. విద్యార్థుల సంఖ్య తగ్గింది. చెట్లు ఎండిపోయాయి. పాఠశాల ప్రాంగణం నిర్జీవమైంది. చివరకు ప్రభుత్వ గుర్తింపు రద్దయింది. ఇది కేవలం ఒక పాఠశాల మూతపడడం కాదు. అది ఒక తరం కలల అంత్యక్రియలు. కొంత భూమి అన్యాక్రాంతమైంది. మరికొంత డిగ్రీ కళాశాలకు కేటాయించారు. దాతలు ప్రేమతో ఇచ్చిన భూమి మాటేమిటి? ఆ త్యాగానికి న్యాయం ఏది?

## ఇది కొత్త పోరాటం కాదు..

ఆ బడిలో చదివిన వారికి ఇది భరించడం అసాధ్యమైంది. వాట్సాప్ గ్రూప్ పుట్టింది. మనసులు కలిశాయి. గొంతులు ఒక్కటయ్యాయి. "సేవ్ ఆర్‌హెచ్ఎస్" ఉద్యమం ఊపందుకుంది. ఇది కొత్త పోరాటం కాదు. 1980ల దశకంలోనే అప్పటి విద్యార్థి సంఘ అధ్యక్షుడు ఎం. ముజీబుర్ రహమాన్ నాయకత్వంలో పాఠశాలను జిల్లా పరిషత్ పాలనలోకి తీసుకురావాలని ఉద్యమం జరిగింది. అప్పటి కమిటీ మొండి వైఖరి వల్ల ఆ ప్రయత్నం ఫలించలేదు. కానీ ఆ ఉద్యమ స్ఫూర్తి ఆరిపోలేదు. ఆ రోజుల్లో విద్యార్థుల పోరాటం వల్లే శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనానికి ప్లాస్టరు వేయబడింది. పిల్లర్లు నిర్మించబడ్డాయి. ఆ భవనం ఈనాటికీ నిలబడి ఉంటే అది ఆ విద్యార్థుల ప్రేమకు నిదర్శనం. పూర్వ విద్యార్థులు ఒక్క మాటలో చెప్తున్నారు.. "మా బడి గుడి కన్నా మిన్న. దాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. రద్దయిన గుర్తింపు పునరుద్ధరించాలి. పూర్వ వైభవం తీసుకురావాలి. అంతవరకు వెనక్కు తగ్గేది లేదు." ఇది కేవలం ఒక బడి కోసం పోరాటం కాదు. ఇది తమ బాల్యం కోసం, తమ గురువుల జ్ఞాపకం కోసం, తమ తల్లిదండ్రులు పడిన కష్టం కోసం, రేపటి తరానికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఒక తరం వెళ్ళిన ఆక్రోశం.

## గుండెచప్పుడు మీకు వినిపిస్తోందా?

వడ్డేపల్లి పంచాయతీ పరిధిలోని శాంతినగర్ నుండి మొదలై పైపాడు, కల్కుంట్ల, బుడమరసు, బూడిదపాడు, కోయిలదిన్నె, జిల్లేడు దీన్నె, శ్రీనగర్, చంద్రశేఖర్ నగర్, కొరివిపాడు, మద్దూరు.. ఈ గ్రామాలన్నింటి పిల్లలకు ఒకప్పుడు వెలుతురు చూపించిన పాఠశాలను మళ్ళీ వెలిగించే బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల చెమటతో, దాతల దయతో పుట్టిన ఆ పాఠశాలను కాపాడడం.. ఇది ఏ పార్టీ ఎజెండా కాదు, ఇది మానవ ధర్మం. శాంతినగర్ పూర్వ విద్యార్థుల గుండె చప్పుడు వినిపిస్తోంది. మీకు వినిపిస్తోందా?

# 23 నుండి అమరజ్యోతి కేంద్రంగా సంప్రదింపులు

- దశలవారీగా ఉద్యమకారులకు గుర్తింపు
- తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని సందర్శించిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ
- ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా సలహాలు సూచనలు స్వీకరిస్తామని తెలిపిన కమిటీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా అమరజ్యోతి ప్రాంగణంలో నిర్మించిన వివిధ గదులను పరిశీలించిన కమిటీ సభ్యులు, ప్రత్యేకంగా ఆడియో-విజువల్ రూమ్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కమిటీ చైర్మన్ కే. కేశవరావు నేతృత్వంలో అమరజ్యోతి కేంద్రంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ నెల 23వ తేదీ నుండి అమరజ్యోతి కేంద్రంగా వివిధ వర్గాలతో సంప్రదింపులు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఇందులో విద్యార్థి జేఏసీ ప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అడ్వకేట్లు, డాక్టర్స్ తదితర వర్గాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నారు. 2001 నుండి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ప్రజా సంఘాల ఉద్యమకారులు, ఉద్యమకారుల సంక్షేమ కమిటీలు మరియు ఇతర వర్గాలతో రాజకీయాలకు అతీతంగా విస్తృత స్థాయిలో చర్చలు జరిపి ఉద్యమకారుల గుర్తింపుకు అవసరమైన సూచనలు, సలహాలను దశలవారీగా సేకరించాలని కమిటీ నిర్ణయించింది. ఈ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో సూచనలు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ఆఫ్‌లైన్ విధానంలో ఉద్యమకారులు తమ ప్రతినిధ్యాలు సమర్పించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి, అందిన అభిప్రాయాలు, వివరాలను నమోదు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# ఒడిషాలో ఘోర రోడ్డు ప్రమాదం

- రెండు ట్రక్కులు ఢీకొని ఇద్దరు డ్రైవర్ల సజీవ దహనం

**భువనేశ్వర్, జూన్16 (జనంసాక్షి) :** ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైవేపై ఝూర్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపుతప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. వాహనాలు ఢీకొన్న సమయంలో డీజిల్ ట్యాంకర్ పగలడం వల్ల ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. రెండు ట్రక్కులకు పూర్తిగా మంటలు అంటుకున్నాయి. డ్రైవర్లు బయటపడే అవకాశమే లేకపోయింది. ఇది గమనించిన ఇతర వాహనదారులు వెంటనే పోలీసులు, ÷ర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కానీ, ఆలోపే ట్రక్కుల్లో ఇద్దరు డ్రైవర్లు కాలిపోయి మరణించారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది.

# చిన్న కాంట్రాక్టర్లకు ప్రజాప్రభుత్వం అండ

- దశలవారీగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తాం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- 18న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన సివిల్ కాంట్రాక్టర్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో స్పందిస్తోందని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేయగా, ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతినెలా నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వారికి గుర్తుచేశారు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఆయన వివరించారు. రాష్ట్రంలో చిన్న కాంట్రాక్టర్లకు దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. అంతకుముందు, ఈ రోజు మధ్యాహ్నం కాంట్రాక్టర్ల ప్రతినిధులు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌కు చేరుకుని, మంత్రి కోమటిరెడ్డితో జరిగిన చర్చల సారాంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు.

**'చలో హైదరాబాద్' వాయిదా: రవీందర్ రెడ్డి**

పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన సానుకూల హామీతో తాము ఎంతో సంతృప్తి చెందామని, ఈ నెల 18న చేపట్టదలచిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు అసోసియేషన్ తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డివిఎన్ రెడ్డి, సుగుణాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 19నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు


- ఆహ్వాన పత్రికను మంత్రి పొన్నంకు అందచేత



**హైదరాబాద్, జూన్16 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ ఏడాది నిర్వహించబోయే వార్షిక బోనాల జాతర కార్యక్రమాల అధికారిక షెడ్యూల్ వివరాలను ఆలయ చైర్మన్, అర్చక బృందం కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అందజేశారు. జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ వివరాలను మంత్రికి సమర్పించారు. ఆలయ దేవస్థానం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. జూలై 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు అమ్మవారి ఘటోత్సవం కార్యక్రమంతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం, జాతరలో అత్యంత కీలకమైన ప్రధాన బోనాల ఉత్సవాన్ని ఆగస్టు 2వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల నుంచే ప్రారంభించనున్నారు. ఆ రోజంతా లక్షలాది మంది మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అమ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

# రష్యాలో కుప్పకూలిన బాంబర్

- శిక్షణ ఇస్తుండగా కూలినట్లు ప్రకటన



**మాస్కో, జూన్ 16 (జనంసాక్షి) :** రష్యాకు చెందిన బాంబర్ విమానం (టియు-22ఎం3) కూలిపోయింది. సోమవారం సైబీరియాలోని ఇర్కుట్స్ ప్రాంతంలో శిక్షణనిస్తుండగా విమానం కూలిపోయిందని, ఆ ప్రాంతాన్ని దట్టమైన పొగ కమ్మేసిందని రక్షణ శాఖ తెలిపింది. నలుగురు సిబ్బంది సురక్షితంగా బయపడ్డారని పేర్కొంది. విమానం కూలిన దృశ్యాలు మీడియాలో వైరల్ గా మారాయి. అంగారా నది సమీపంలోని అటవీ ప్రాంతంలో విమానం కూలిపోతుండగా, దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలు కనిపించాయి. రష్యాకు చెందిన టియు- 22ఎం3 బాంబర్ విమానం కూలిపోయిన తర్వాత, అందులోని నలుగురు సిబ్బంది బయటకు దూకారని అధికారులు తెలిపారు. విమానంలో ఎటువంటి యుద్ధ సామాగ్రి లేదని, దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని అన్నారు. కామెంకా గ్రామానికి సమీపంలో విమానం కూలిపోయిందని ఇర్కుట్స్క్ గవర్నర్ ఇగోర్ కోబ్రజెవ్ ధృవీకరించారు. ప్రమాద స్థలంలో చెలరేగిన మంటలను ఆర్పివేసేందుకు అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని అన్నారు. ఇంజన్ వైఫల్యం కారణంగా ఈ ప్రమాదం జరిగి వుండవచ్చని ఆయన వెల్లడించారు. టియు-22ఎం3 అనేది ఒక ఆధునిక వెర్షన్, ఇది -22 క్రూయిజ్ క్షిపణులతో పాటు గాలి నుండి ప్రయోగించే హైపర్‌సోనిక్ కింజాల్ క్షిపణులను కూడా మోయగలదు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370